www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్
12.04.2024
సంపుటి:2 సంచిక: 181

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# లోక్ సభ బరిలో ఇందిరా హంతకుడు

## స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..




**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హంతకుడి కుమారుడొకరు లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడం చర్చనీయాంశంగా మారింది. పంజాబ్ లోని ఫరీద్‌కోట్ స్థానం నుంచి 45 ఏళ్ల సరబ్‌జీత్ సింగ్ ఖల్సా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇందిరాగాంధీ హంతకుల్లో ఒకడైన బియాంత్ సింగ్ కుమారుడే సరబ్‌జీత్. గతంలో ఈయన పలు ఎన్నికల్లో పోటీ చేశారు. 2004లో బఠిండా స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 1,13,490 ఓట్లు దక్కాయి. ఆ తర్వాత 2007లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో భదౌర్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లోనూ బఠిండా, ఫతేగఢ్ సాహిబ్ స్థానాల నుంచి పోటీ చేసి మిగతా 2లో

# టెర్రరిస్టులను వదిలిపెట్టం

- వెంటాడి మట్టుబెడతాం
- పదేండ్లలో ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నాం
- గతంలో కేంద్రంలో బలహీన ప్రభుత్వం
- సైనికులకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కూడా లేవు
- ప్రధాని నరేంద్ర మోదీ







**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

భారత్‌కు హాని తలపెట్టేందుకు యత్నిస్తున్న ఉగ్రవాదులను వదలబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉరి, బాలాకోట్ దాడులను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో బీజేపీ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొన్న మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

పదేళ్లలో కేంద్రంలోని తమ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను మరోసారి గుర్తుచేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ హయాంలోని తప్పులను ఎత్తిచూపారు. ''నేడు మన దేశంలో బలమైన ప్రభుత్వం ఉంది. ఉగ్రవాదులు తిరిగి తమ సొంత దేశాలకు పారిపోయినా.. అక్కడికి వెళ్లి మరీ వారిని హతమారుస్తాం. ఏడు దశాబ్దాల అనంతరం ఎన్డీయే నేతృత్వంలో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన 'ఆర్టికల్ 370' రద్దయింది. ట్రిపుల్ తలాక్‌కు చట్టం తీసుకువచ్చింది. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించింది. పేద, జనరల్ కేటగిరీలకు 10 శాతం రిజర్వేషన్ దక్కింది'' అని గుర్తు చేశారు.

### కేంద్రంలో బలహీన ప్రభుత్వముంటే..

కాంగ్రెస్ హయాంలోని తప్పులను ప్రస్తావిస్తూ.. ఆ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ''కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశం కోసం పోరాడే సైనికులకు కనీస సౌకర్యాలు కూడా లేవు. వారికి సరైన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను అందించలేకపోయింది. కానీ, మా ప్రభుత్వం వారికి అవన్నీ అందించి ఎంతోమంది సైనికులను కాపాడుకోగలుగుతోంది. యుద్ధ విమానాలు, ఆధునిక రైఫిల్స్ వంటి ఆయుధాలను స్వయంగా తయారుచేసుకునేలా భారత్ అభివృద్ధి చెందింది. ఒకవేళ కేంద్రంలో బలహీనమైన ప్రభుత్వం ఉంటే అది మన శత్రువులకు బలం చేకూరుస్తుంది'' అని మోదీ వ్యాఖ్యానించారు.

## గేమర్లతో మోడీ వీడియో గేమ్

ఆన్‌లైన్ వీడియో గేమ్స్‌తో పాపులారిటీ సంపాదించిన కొంతమంది గేమర్లతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముచ్చటించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన గేమర్లు తీర్థ్ మెహతా, పాయల్ ధరీ, అనిమేశ్ అగర్వాల్, అన్షు బిష్త్, నమన్ మథుర్, మిథిలేశ్ పటాంకర్, గణేశ్ గంగాధర్ ఇటీవల ప్రధాని నివాసానికి వెళ్లారు. ఈసందర్భంగా గేమింగ్ పరిశ్రమపై చర్చించిన మోదీ వారితో కలిసి కొంతసేపు పీసీ, వీఆర్ గేమ్స్ ఆడారు. ఇందుకు సంబంధించిన చిన్న వీడియోను భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్‌మీడియాలో పంచుకున్నారు. "గేమింగ్ పరిశ్రమ లో వినూత్నంగా వస్తున్న పరిణామాలు, గేమర్ల సృజనాత్మకతను మోదీ ప్రభుత్వం ఎలా గుర్తించింది అన్న అంశాలపై ప్రధాని వారితో ముచ్చటించారు. గేమింగ్స్, గ్యాంబ్లింగ్ సమస్యలు, ఈ రంగంలో మహిళల భాగస్వామ్యంపై కూడా మోదీ చర్చించారు" అని మాలవీయ రాసుకొచ్చారు. పూర్తి వీడియోను త్వరలోనే విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ వీడియోలో ప్రధాని మోదీ గేమర్లతో కలిసి వీఆర్ సెట్ ధరించి కొంతసేపు గేమ్స్ ఆడారు. వారికి ఆటోగ్రాఫ్ ఇచ్చారు. ప్రధానిని కలవడం తమకు చాలా గర్వంగా ఉందని గేమర్లు ఆనందం వ్యక్తంచేశారు.

# ధాన్యం కొనుగోలులో నో కాంప్రమైజ్

- జనగామ అడిషనల్ కలెక్టర్ కు ప్రశంసలు
- అధికారులు కొనుగోలు విషయంలో చిత్తశుద్ధితో ఉండాలి
- వ్యాపారులతో కుమ్మక్కయ్యారో సహించం
- సీఎం రేవంత్ రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పత్రికల్లో వచ్చిన వార్తపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ధాన్యంలో తేమ, తాలు సాకుతో కనీస మద్ధతు ధర కంటే ట్రేడర్లు తక్కువ ధరకు కొనడంతో జనగామ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు రైతులు బుధవారం నిరసన చేశారు. ప్రభుత్వం ధర రూ. 2,203 కంటే తక్కువ ధర రూ. 1,500 ఇవ్వడమేంటని ప్రశ్నించారు. మద్దతు ధర చెల్లించాల్సిందేనని అధికారులను నిలదీశారు. ఈ సంఘటన గురించి తెల్సుకున్న అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ మార్కెట్ యార్డుకు వచ్చి రైతులతో మాట్లాడి ట్రేడర్లు ఇచ్చిన ధరల చిట్టీచూసి అవాక్కయ్యారు. దీంతో ట్రేడర్లపై క్రిమినల్ కేసులు నమోదు చెయ్యాలని ఆయన ఆదేశించారు.రైతుల సమస్య పట్ల మిగతా 2లో

# ఎంఐఎం నేర రాజ్యానికి, చీకటి వ్యాపారాలకు ప్రభుత్వం అండ

- మొన్నటి వరకు కేసీఆర్ ఫ్యామిలీ, ఒవైసీ ఫ్యామిలీ ఉండేది
- ఇప్పుడు సోనియా ఫ్యామిలీ.. ఒవైసీ ఫ్యామిలీగా మారింది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

వివరాలు 2లో










రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ నివాసానికి వెళ్లారు. రంజాన్ సందర్భంగా షబ్బీర్ అలీని సిఎం మర్యాదపూర్వకంగా కలిశారు. రంజాన్ వేడుకల్లో పాల్గొని అనంతరం విందు ఆరగించారు. సిఎం వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టిపిసిసి అధికార ప్రతినిధి మధుయాష్కి గౌడ్ ,ఎమ్మెల్యే దానం నాగేందర్, రోహిన్ రెడ్డి ఉన్నారు. అటు రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రంజాన్ సందర్భంగా హైదరాబాద్ లో ముస్లింల ప్రత్యేక ప్రార్ధనలు వినిపిస్తున్నాయి. మీర్ అలం, ఈద్గా, చార్మినార్, మక్క మసీద్ లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థలు చేస్తున్నారు.

# కవిత మళ్లీ అరెస్ట్

- ఈసారి సీబీఐ వంతు
- ఇప్పటికే ఈడీ కేసులో అరెస్టై జ్యుడీషియల్ కస్టడీలో..
- తాజాగా మరో అరెస్ట్
- బెయిల్ రావడం ఇప్పట్లో కష్టమే..
- తీహార్ జైలు నుంచే సీబీఐ కస్టడీలోకి..



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. మనీ లాండరింగ్ కు సంబంధించి ఈడీ కేసులో ఇప్పటికే ఆమె తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తాజాగా, కవితను గురువారం ఈ కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. కాగా, లిక్కర్ కేసుకు సంబంధించి కవితను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం అందుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ నెల 6న కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను ప్రశ్నించింది. ఇదే కేసులో గతంలో ఆమెను సీబీఐ ప్రశ్నించింది. తాజాగా, కవితను కస్టడీలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తో కలిసి ఆమె కుట్రలు పన్నారని సీబీఐ ఆరోపించింది. ఈ క్రమంలో కవితను జ్యుడీషియల్ కస్టడీ నుంచి సీబీఐ మిగతా 2లో

## వరుస షాక్‌లు

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో రోజుకో కీలక పరిణామం చోటు చేసుకుంటోంది. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత దాఖలు చేసిన పిటిషన్ ను రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 8న కొట్టేసింది. చిన్న కుమారుడికి పరీక్షలు ఉన్నందున ఈ నెల 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏప్రిల్ 4న తీర్పును రిజర్వ్ చేసింది. అనంతరం ఈ నెల 8న (సోమవారం) దీనిపై తీర్పు వెలువరించింది. ఇక, ఈ కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు కవితను గతంలోనే హైదరాబాద్ లో విచారించారు. ఈడీ కేసులో తీహార్ జైలులో ఉన్న అనంతరం ఆమెను కోర్టు అనుమతితో ఈ నెల 6న ప్రశ్నించారు. తాజాగా, ఆమెను తీహార్ జైలు నుంతి తమ కస్టడీలోకి తీసుకున్నారు.



## పదేండ్లు రేవంత్ సీఎం

- కాంగ్రెస్ పార్టీలో నో గ్రూప్స్
- టీం వర్క్ గా పని చేస్తున్నాం
- ఏక్ నాథ్ షిండేలు లేరు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- హరీశ్, ఏలేటి నోరు అదుపులో పెట్టుకోవాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

వివరాలు 2లో

# ఢిల్లీకి రేవంత్ రెడ్డి

- ఆ మూడు సీట్లపై క్లారిటీ
- ఖమ్మం సీటు విషయంలోనే పీటముడి
- గట్టిగా పట్టుబడుతున్న పొంగులేటి, భట్టి
- కరీంనగర్ సీటు విషయంలో రోజుకో ట్విస్ట్
- హైదరాబాద్ సీటు విషయంలో ఎంఐఎంతో కాంప్రమైజ్
- హిందూ అభ్యర్థిని బరిలో దించే చాన్స్
- రాష్ట్ర వ్యాప్తంగా మజ్లీస్ మద్దతు కూడగట్టుకొనే ప్లాన్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. ఏఐసీసీ పెద్దలతో ఆయన భేటీకానున్నారు. లోక్ సభ ఎన్నికలకు సంబంధించి హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ స్థానాలు పెండింగ్ లో ఉన్నాయి. ఈ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ పెద్దలతో రేవంత్ భేటీ అవుతారు. ఈ భేటీలో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది. 14 పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. మరో మూడు స్థానాలను మాత్రం పెండింగ్‌లో పెట్టింది. ఖమ్మం, కరీంనగర్ అభ్యర్థులపై మిగతా 2లో

# లోక్ సభ బరిలో ఇందిరా హంతకుడు

మొదటిపేజీ తరువాయి

పరాజయం పాలయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో తనకు 3.5 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో ప్రకటించారు. కాగా.. సరబ్‌జీత్ తల్లి బిమల్ కౌర్ ఖల్సా 1989 సార్వత్రిక ఎన్నికల్లో రోపర్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. అదే ఎన్నికల్లో ఆయన తాత సుచాసింగ్ కూడా బఠిండా నుంచి విజయం సాధించారు. ప్రస్తుతం సరబ్‌జీత్ పోటీ చేస్తున్న ఫరీద్‌కోట్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ సాదిఖ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ భాజపా తరఫున వాయవ్య దిల్లీ సిట్టింగ్ ఎంపీ, పంజాబీ జానపద, సినీ నేపథ్య గాయకుడు హన్స్‌రాజ్ హన్స్ పోటీ చేస్తున్నారు. ఇక, ఆమ్‌ఆద్మీ పార్టీ.. ప్రముఖ కమెడియన్ కరంజీత్ అనుమోల్‌ను బరిలోకి దించింది. శిరోమణి అకాలీదళ్, కాంగ్రెస్ ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించలేదు. 1984 అక్టోబరు 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని ఆమె భద్రతా సిబ్బంది బియాంత్ సింగ్, సత్వంత్ సింగ్ తుపాకులతో కాల్చడంతో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# ధాన్యం కొనుగోలులో నో కాంప్రమైజ్

మొదటిపేజీ తరువాయి

పట్టనట్టు వ్యవహరించిన మార్కెట్ సెక్రటరీని సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. మద్దతు ధరకే ధాన్యం కొంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ విషయాన్ని ఓ దినపత్రిక ప్రచురించింది. సీఎం రేవంత్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. కలెక్టర్ ను అభినందిస్తూ ట్వీట్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో చిత్తశుద్ధితో ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. రైతుల కష్టాన్ని ఎవరైనా మార్కెట్ కమిటీ అధికారులు.. వ్యాపారులతో కుమ్మక్కైనట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల, రైతు సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి స్పందన ద్వారా ఇతర చోట్ల అధికారులు స్వేచ్ఛగా... వ్యవహరించే అవకాశం ఉందని బావిస్తున్నారు. మామూలుగా ట్రేడర్లు రాజకీయ మద్దతుతో రైతుల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తూ ఉరారు. అలాంటి వాటిని సహించే ప్రశ్నే లేదని తేల్చడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి అధికారవర్గాలకు గట్టి సందేశం పంపించారని అనుకోవచ్చు.

# సీఎంలో అభద్రత

- ప్రభుత్వంలో షిండే లు లేకుంటే భయమెందుకు
- ప్రభుత్వం రీ-సెటిల్మెంట్ దందా చేస్తుంది
- బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- ప్రభుత్వ అక్రమాలను బయట పెట్టుతాం

విశాలభారతి,స్టేట్ బ్యూరో:



గత ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలను దగ్గర పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రీసెటిల్మెంట్ చేసుకుంటుందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. నాలుగు నెలలు గడిచినా అవినీతి పరులపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం అంతర్గతంగా సెటిల్మెంట్ చేసుకుంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్లో శిందేలు లేకపోతే మహబూబ్నగర్లో సీఎం రేవంత్రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడారని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న 15 ఎకరాల భూమి హెటిరో డ్రగ్స్ పార్థసారథికి గత ప్రభుత్వం ఇచ్చిందని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మార్కెట్లో ఆ భూమి విలువ రూ.1500కోట్లు రూ.2000కోట్ల వరకు ఉంటుందన్నారు. జీవో నంబర్ 37 ద్వారా అదే భూమిని ప్రస్తుత ప్రభుత్వం హెటిరో డ్రగ్స్ పార్థసారథికి మళ్లీ కేటాయించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ఒక్కొక్కటిగా బయట పెడతామని మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. రూ.300 కోట్లను సీఎం రేవంత్రెడ్డి దిల్లీకి పంపించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

# కవిత మళ్లీ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

హెడ్ క్వార్టర్స్ కు తరలించనున్నారు. మరోవైపు, కవిత రెగ్యులర్ పిటిషన్ పై ఈ నెల 16న విచారణ జరగనుండగా.. తాజాగా సీబీఐ కస్టడీలోకి తీసుకోవడం సంచలనంగా మారింది. లిక్కర్ స్కాంకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితన మార్చి 15న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఆమెను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరచగా.. కోర్టు మార్చి 26 వరకూ ఈడీ కస్టడీకి అప్పగించింది. అనంతరం కస్టడీ గడువు ముగియడంతో కోర్టు కవితకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆమెను తీహార్ జైలుకు తరలించారు. రెండు రోజుల క్రితం మళ్లీ కోర్టులో హాజరు పరచగా.. ఆమె జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగించింది. దీంతో ఆమె ఈ నెల 23 వరకూ తీహార్ జైలులోనే ఉండనున్నారు. మరోవైపు, కవిత రెగ్యులర్ బెయిల్ పిటిషన్ పై ఈ నెల 16న విచారణ జరగనుంది.

# ఢిల్లీకి రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హస్తం నేతలు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఖమ్మం సీటు కాంగ్రెస్‌లో హాట్ టాపిక్ గా మారింది. ఉమ్మడి ఖమ్మంలో మిత్రపక్షం సీపీఐతో కలిసి అన్ని చోట్ల విజయం సాధించారు. ముగ్గురు మంత్రులు తమ కుటుంబసభ్యులకు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. తన తమ్ముడికి టికెట్ ఇస్తే గెలిపించే బాధ్యత తీసుకుంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ పెద్దలకి చెప్పినట్టు సమాచారం. ఇక తన సతీమణి నందినికి టికెట్ ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హైకమాండ్‌ను కోరినట్లు తెలుస్తోంది.మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్‌కు ఖమ్మం సీటు ఇవ్వాలని కోరుతున్నారు. సీనియర్ వి.హనుమంతరావు కూడా ఖమ్మం టికెట్ కోసం అధిష్ఠానాన్ని కలిశారు. సామాజిక సమీకరణలో భాగంగా ఎవరికి టికెట్ ఇస్తారనేది పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. కరీంనగర్ ఎంపీ టికెట్ విషయంలోనూ కాంగ్రెస్ ఒక క్లారిటీకి రాలేకపోతోంది. కరీంనగర్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని అధిష్ఠానం కోరగా ఆయన నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానని చెప్పడంతో కరీంనగర్ టికెట్ పెండింగ్ లో పడింది. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, పార్టీ నేత వెల్చాల రాజేందర్‌రావు టికెట్ ఆశిస్తున్నారు. కరీంనగర్‌లో వెలమ సామాజికవర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉండటంతో..ఆ సామాజిక వర్గానికి చెందిన రాజేందర్ రావు పేరు బలంగా వినిపిస్తోంది. హైదరాబాద్ అభ్యర్థి విషయంలో కూడా కాంగ్రెస్ ఈక్వేషన్స్ మారిపోయాయి. ఇటీవల కాంగ్రెస్‌కు ఎంఐఎం దగ్గర కావడంతో.. పెద్దగా పోటీ ఇవ్వని బలహీన నేతను దింపాలన్న ఆలోచన చేస్తున్నారు. హిందూ అభ్యర్థిని బరిలోకి దింపితే.. మజ్లిస్ రాష్ట్రం మొత్తం మద్దతిస్తుందన్న ఆలోచన చేస్తున్నారు. ఢిల్లీ పర్యటనను ముగించుకుని వచ్చిన తర్వాత రేవంత్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. మొత్తం 17 లోక్ సభ స్థానాల్లో 10కి పైగా స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. శాసనసభ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రయత్నిస్తోంది.

# ఎంఐఎం నేర రాజ్యానికి, చీకటి వ్యాపారాలకు ప్రభుత్వం అండ

- మొన్నటి వరకు కేసీఆర్ ఫ్యామిలీ, ఒవైసీ ఫ్యామిలీ ఉండేది
- ఇప్పుడు సోనియా ఫ్యామిలీ.. ఒవైసీ ఫ్యామిలీగా మారింది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

విశాలభారతి,స్టేట్ బ్యూరో :



ఎంఐఎం నేర రాజ్యానికి,చీకటి వ్యాపారలకు ప్రభుత్వం అండగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాంపల్లి, చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కు కొమ్ము కాస్తూ, దుష్యాసన పాత్రను ఎంఐఎం పోషించిందని ఆయన మండిపడ్డారు. ఎవరు అధికారంలో ఉంటే వారితో అంటకాగే పార్టీ ఎంఐఎం అని ధ్వజమెత్తారు. పాత బస్తీ అభివృద్ధిని అడ్డుకున్న పార్టీ ఎంఐఎం అని ఆగ్రమం వ్యక్తంచేశారు. అక్కడి ప్రజల బతుకులను చీకటిలో ఉంచిందని విరుచుకుపడ్డారు. మజ్లిస్ నేతల కాళ్ళ వద్ద కేసీఆర్ కూర్చుని దుర్మార్గమైన పాలన సాగించారని విమర్శలు గుప్పించారు. బీఆర్ ఎస్ నాయకులు ఎంఐఎం నేతలకు వంగి వంగి సలాం కొట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే.. దేశ్ కి నేత అయిన కేసీఆర్ ను వదిలేసి.. కాంగ్రెస్ చెంతకు చేరారని సెటైర్లు వేశారు. మొన్నటి వరకు కేసీఆర్ ఫ్యామిలీ, ఒవైసీ ఫ్యామిలీ రాష్ట్రంలో ఉండేదని, ఇప్పుడు సోనియా ఫ్యామిలీ.. ఓవైసీ ఫ్యామిలీ ఉన్నాయని విమర్శలు చేశారు. ఓవైసీ బ్రదర్స్.. ఎంతో మంది హిందువుల బస్తీలను ఖాళీ చేయించారని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. మజ్లీస్ కు భయపడి.. చెంగిచర్ల దాడి నిందితులపై చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. లండన్ లో ఉన్న నదిలా.. మూసీని చేస్తామని చెప్పి అసద్ తో పాటు కలిసి వెళ్లి చూసొచ్చారని ఆయన పేర్కొన్నారు. అసద్ ఓడిపోవద్దని.. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం, స్టేట్ పార్టీ డిసైడ్ అయిందని, తనకు ఇష్టం లేకపోయినా ఆయన్ను గెలిపించేందుకు కృషి చేస్తానని ఫిరోజ్ ఖాన్ చెప్పారన్నారు. బీజేపీని అడ్డుకునేందుకు దుర్మార్గపు చర్యలు కాంగ్రెస్ చేస్తోందని విరుచుకుపడ్డారు. బీజేపీని ఓడించేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారని ఫైరయ్యారు. స్టోరీ పాతదే.. కానీ.. పాత్రలు మాత్రం మారాయని ఎద్దేవాచేశారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ నేతలు ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు పాత్రధారులుగా ఉన్నారని పేర్కొన్నారు. మొన్నటి వరకు రాహుల్ ను తిట్టిన ఒవైసీ బ్రదర్స్.. ఇప్పుడు ఒప్పందాలు చేసుకున్నారని మండిపడ్డారు. ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ మూడూ ఒకటేనని, వాటి డీఎన్ఏ ఒకటేనని సెటైర్లు వేశారు. ఈ మూడు పార్టీలు హిందూ వ్యతిరేక పార్టీలేనని ఫైరయ్యారు. బీఆర్ఎస్ హయాంలో అసద్ మోటార్ సైకిల్ పై వెళ్తే ప్రగతి భవన్ గేట్లు తెరుచునేవని, అదే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులకు ఎంట్రీ కూడా ఉండేది కాదన్నారు. ఎంఐఎం తీరుతో.. పాతబస్తీలోని హిందువులు, ముస్లింలందరూ కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. అందుకే.. కాంగ్రెస్, ఎంఐఎం ఒప్పందాన్ని దెబ్బతీసేలా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీని గెలిపించాలని కిషన్ రెడ్డి కోరారు.

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- అధికారంలోకి వచ్చి కరువు తెచ్చింది
- లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయింది
- ఓటేస్తే మన కంటిని మనం పొడుచుకున్నట్లే
- ఎమ్మెల్యే హరీశ్ రావు



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కి గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం నాడు చిన్నకోడూరు మండలం పెద్ద కోడూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీష్ రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజా శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్ రాంరెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య హయాంలో 6 గంటలు మాత్రమే కరెంట్ వచ్చేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 24 గంటల కరెంట్, సాగునీరు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కరువు తెచ్చిందని విమర్శించారు. తెలంగాణలో లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల రుణమాఫీ అయినా రైతులు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలి... రుణామాఫీ కానివారు బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ఓట్లు కోసం వచ్చే ఆ పార్టీ నేతలను మహిళలు చీపురు కట్టలతో తరమాలాని వార్నిగ్ ఇచ్చారు. కాంగ్రెస్‌కి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేస్తే మన కంటిని మనం పొడుచుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. సిద్దిపేట అభివృద్ధిని ఓర్వని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకి ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గతంలో దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్ రావు ఏ ఒక్క హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అందుకే మొన్నటి అసెంబ్లీ ఆయనను దుబ్బాక ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు. 10 ఏళ్ల బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని.. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెరిగాయని మండిపడ్డారు. బీజేపీ నల్ల చట్టలు తెచ్చి 700మంది రైతులను పొట్టన పెట్టుకుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీకి గులాం గిరి చేస్తే, గులాబీ జెండా పట్టుకున్నోళ్లు జై తెలంగాణ అని నినదిస్తారని హరీశ్‌రావు అన్నారు. తాను కలెక్టర్‌గా ఉన్న సమయంలో మెదక్ ఉమ్మడి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశానని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రాంరెడ్డి తెలిపారు. ప్రజల ఆదరణతో తాను ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నానని చెప్పారు. తాను అంచెలంచెలుగా కలెక్టర్ వరకు ఎదిగానని అన్నారు. తాను ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద బలహీన వర్గాలకు సహాయం అందిస్తానని వెంకట్ రాంరెడ్డి హామీ ఇచ్చారు.

# కేజ్రీవాల్‌కు మరో షాక్

## వ్యక్తిగత కార్యదర్శిపై వేటు

విశాలభారతి,నేషనల్ బ్యూరో:

లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న డిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. ఆయన వ్యక్తిగత కార్యదర్శి వైభవ్ కుమార్‌ను తాజాగా విధుల నుంచి తొలగించారు. అతడి నియామక ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ విజిలెన్స్ వెల్లడించింది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేశాడని వైభవ్ కుమార్‌పై 2007లో నోయిడా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, కేజ్రీవాల్‌కు పీఎస్‌గా నియమించే సమయంలో ఈ కేసు వివరాలను వెల్లడించలేదని విజిలెన్స్ విభాగం దర్యాప్తులో తేలింది. దీంతో ఆయన్ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ''ఈ నియామకంలో అవకతవకలు జరిగాయి. పాలనావ్యవహారాల పరంగా ఇది ఇబ్బందికర పరిణామం. ఎలాంటి ముందస్తు వెరిఫికేషన్ లేకుండా, పూర్వాపరాలను సరిచూడకుండా మంత్రుల వ్యక్తిగత సిబ్బందిని నియమించడం సరికాదు. వైభవ్‌పై నమోదైన అభియోగాలు తీవ్రమైనవి. వాటిపై విచారణ జరుగుతోంది. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకోకుండానే పీఎస్‌గా నియమించారు'' అని విజిలెన్స్ విభాగం తమ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా.. మద్యం కేసుకు సంబంధించి ఏప్రిల్ 8న వైభవ్ కుమార్‌ను ఈడీ ప్రశ్నించింది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయనపై వేటు వేయడం గమనార్హం. ఈ పరిణామాలపై ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ పార్టీని సమూలంగా నాశనం చేసేందుకే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని భాజపాను దుయ్యబట్టింది. ''మొదట తప్పుడు కేసులో సీఎంను అరెస్టు చేశారు. ఇప్పుడు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సహా కేజ్రీవాల్ సిబ్బంది మొత్తాన్ని తొలగించే పని మొదలుపెట్టారు. ఆప్‌ను నాశనం చేయడమే భాజపా ఏకైక లక్ష్యమని మరోసారి స్పష్టమైంది'' అని మండిపడింది.

# మాదిగలకు ఒక్క సీటు ఇవ్వరా?

- వివేక్ ఫ్యామిలీలో మూడు సీట్లు ఇస్తారా?
- రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగల జనాభా
- ఒక్క సీటుకు మేం అర్హులం కాదా..
- మోత్కుపల్లి నరసింహులు

విశాలభారతి,స్టేట్ బ్యూరో:



తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వరా? అంటూ మోత్కుపల్లి నర్సింహులు ప్రశ్నించారు. '80 లక్షల మంది ఉన్న మా మాదిగలకు ఒక్క టికెట్ ఇవ్వరు కానీ గడ్డం వివేక్ కుటుంబంలో మాత్రం 3 టిక్కెట్లు ఎలా ఇస్తారు?. ఒక్క సీటుకు కూడా మా మాదిగలు అర్హులు కారా? మా మాదిగ కులానికి న్యాయం చేయండి. 10 మంది సీఎంలను చూసాను కానీ ఈరకంగా మాదిగలకు టికెట్ ఇవ్వకుండా ఎవరూ లేరు. మాదిగలు ఓట్లు వేయకపోతే కాంగ్రెస్ భవిష్యత్ ఏంటి? ఒక కాంగ్రెస్ నాయకుడిగా బాధ పడుతున్నా. మా మాదిగ జాతికి రిజర్వేషన్ లేనట్లుగా 3 స్థానాల్లో ఒక్కటి కూడా కేటాయించకుండా అన్యాయం చేస్తుంది. ఇది మాదిగ జాతికి అవమానకరం. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోసం రోజు ట్రై చేస్తున్నాను కానీ ఇవ్వట్లేదు' అంటూ మోత్కుపల్లి ప్రశ్నించారు.

# పదేండ్లు రేవంత్ సీఎం





విశాలభారతి,స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో ఈ ఐదేళ్లతో పాటు వచ్చే ఐదేళ్లు కూడా రేవంత్ రెడ్డే సీఎంగా ఉంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం నల్లగొండలో నిర్వహించిన రంజాన్ వేడకల్లో పాల్గొన్న అనంతరం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని హరీశ్ రావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కామెంట్స్ పై మంత్రి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు లేవని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తామంత టీం వర్క్ గా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్లు రేవంత్ రెడ్డి సీఎంగా ఉంటారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏక్ నాథ్ షిండేలు లేరని, గ్రూపులు లేవని అన్నారు. ఏక్ నాథ్ షిండే అనే పదం బిజెపి సృష్టించిందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని ఎన్సిపి, శివసేనను వేరుచేసి సంతలో పశువులు కొన్నట్లు ఎమ్మెల్యేలను కొన్నారని మండిపడ్డారు. అది ఇక్కడ వర్తించదని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ లో పది గ్రూపులు ఉన్నాయంటూ మహేశ్వర్ రెడ్డి మాట్లాడం పట్ల మండిపడ్డారు. బిజెపిలో గ్రూపులు లేవా అని ప్రశ్నించారు. బండి సంజయ్ దింపి కిషన్ రెడ్డిని ఎందుకు అధ్యక్షుడు చేశారో నీకు తెలుసా అని ప్రశ్నించారు. దళితులను అడ్డం పెట్టుకొని పదేళ్లు ప్రజలను టిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. బట్టి విక్రమార్క అంటే మాకు అపారమైన గౌరవం ఉందన్నారు.ఆయన ప్రతిపక్ష నేతగా ఉండడం ఇష్టం లేకనే కేసీఆర్ 13 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొన్నాడని విమర్శించారు.ఇప్పటికైనా హరీష్ రావు,మహేశ్వర్ రెడ్డిలు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల లో కాంగ్రెస్ 14 సీట్లు గెలవడం ఖాయమన్నారు. బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు ఒక్క సీటు కూడా గెలవడం కష్టమన్నారు.మహేశ్వర్ రెడ్డి ఇప్పటికైనా పనికిరాని చిట్ చాట్ లు బంద్ చేసుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. ఈ పార్లమెంట్ ఎన్నికలు దేశ ఐక్యత కోసం జరుగుతున్న ఎన్నికలన్నారు.బిజెపి మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టాలని రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. నల్గొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డిని కనివిని ఎరుగని రీతిలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పలువురు కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీసీలకు రాహుల్ క్షమాపణ చెప్పాలి

## రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

విశాలభారతి,స్టేట్ బ్యూరో :

సామాజిక న్యాయం పేరిట రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కారుస్తున్నారని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఘాటు విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలకు లక్ష్మణ్ హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 55 ఏండ్లు పాలించి బీసీలను మోసం చేసినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కర్పూరి ఠాకూర్ ను కాంగ్రెస్ ఎందుకు గుర్తించలేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చరణ్ సింగ్ మనవడిని కాంగ్రెస్ అవమానపరిచిందని లక్ష్మణ్ వివరించారు. రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ అంబేద్కర్ ను రెండుసార్లు పార్లమెంట్ కి వెళ్లనివ్వకుండా ఓడించారని ఫైరయ్యారు. అదే బీజేపీ ఈసారి లోక్ సభ ఎన్నికల్లో 30 శాతం బీసీలకు సీట్లు కేటాయించిందని గుర్తుచేశారు. ఇకపోతే కాక కాలేకర్ కమిషన్ ను నెహ్రూ బుట్టదాఖలు చేశారని, నెహ్రూ బీసీల హక్కులను హరించారని విరుచుకుపడ్డారు. కులం పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారని మండల కమిషన్ సిఫారసులను రాజీవ్ గాంధీ అడ్డుకున్నారని విమర్శలు చేశారు.

# రంజాన్ పర్వదినాన సాయి భోజన్



**బెల్లంపల్లి, విశాల భారతి:**ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లిలో సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకుల సహకారంతో గురువారం మధ్యాహ్నం సాయి భోజన్ అన్నదానం పంచినట్లు వ్యవస్థాపకులు కాంపల్లి శంకర్‌రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని పలు చోట్ల యాచకులకు, మానసిక వికలాంగులకు, వృద్ధులకు, అనాథలకు, పేదవారికి, అన్నార్తులకు మధ్యాహ్నం భోజనం అందజేశారు.

అన్నదానం చేద్దాం

బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్న వారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం అని బాయిజమ్మ సాయి సేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్ ట్రస్ట్ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు. ట్రస్ట్ మేనేజర్ 8106550532, ట్రస్ట్ ఫౌండర్స్ 9959269975 ,9949041595 ఫోన్ నెంబర్లలో సంప్రదించి అన్నార్తులకు అన్నదానం చేయదలుచుకున్న వారు సేవలో భాగస్వామ్యం కావాలని కోరారు.





# వనపర్తి జిల్లాలో ఘనంగా రంజాన్ పండగ వేడుకలు

- **ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ చెప్పిన మేఘారెడ్డి, చిన్నారెడ్డి**

**వనపర్తి విశాల భారతి**జిల్లా వ్యాప్తంగా గురువారం భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలో ని ముస్లిం లు నూతన వస్త్రాలను ధరించి ఊరేగింపుగా ఈద్గా దగ్గర కు వెళ్ళి ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీ లకు చెందిన నాయకులు ఈద్గా దగ్గరకు వెళ్ళి ప్రార్థనలు ముగిసిన తరువాత ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి లు ఈద్గా దగ్గర ముస్లిం సోదరులను కలుసుకుని అప్యాయతతో ఆలింగనం చేసుకున్నారు. అదే విధంగా బీఆర్ఎస్ , బిజెపి, టీడీపీ, అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు హిందూ ముస్లిం లు భాయి భాయి అంటూ పలుకరించుకుని ఆనందం పంచుకున్నారు. ముస్లిం పవిత్ర గ్రంధము ఖురాన్ ఆవిర్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుకరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షనతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్ర పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే మేఘారెడ్డి ,చిన్నారెడ్డి లు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకటరెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు బచ్చురాం, వనపర్తి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ లు పాల్గొన్నారు.



# ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

**ధర్పల్లి విశాల భారతి**ధర్పల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ముస్లింలందరూ రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెల రోజులు ఉపవాస దీక్షలు చేపట్టి.. గురువారం రంజాన్ దినమున నూతన వస్త్రాలు ధరించి.. మసీదులో ప్రార్థనలు చేసారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ రంజాన్ మాసం శాంతి దయా కరుణ సహనానికి బ్రతికే ఈ పవిత్ర రంజాన్ మాసమని ముస్లింలు విశ్వసిస్తారు.



# అనాధాశ్రమంలో లాప్ టాప్ పంపిణి

**బెల్లంపల్లి విశాల భారతి** బెల్లంపల్లి పట్టణంలోని అమ్మ అనాథ శరణాలయంలో ముందు భవిష్యత్ కోసం పిల్లలకు నవోదయ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు పదవ తరగతి ఇంటర్ విద్యార్థులకు కంప్యూటర్ పై అవగాహన కోసం కాగజ్ నగర్ లోని జవహర్ నవోదయ విద్యాలయంలోని పూర్వ విద్యార్థులు.. అక్కడి స్టూడెంట్స్ కి లాప్టాప్ లు అందజేశారు. విద్యతోపాటు టెక్నాలజీ పై అవగాహన కోసం వాటిని అందజేశామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సుష్మ, పొన్న నరేష్, శాంతరం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# బిజెపిలో చేరిన టిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**బాల్కొండ,విశాలభారతి** కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు,టిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత శ్రీకుమార్, పలువురు యువకులు భారత ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు ఆకర్షితులై ఎంపీ ధర్మపురి అర్వింద్,బాల్కొండ నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ వారికి కండువా వేసి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్,మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్,సీనియర్ నాయకులు రెంజర్ల గంగారాం,చింత ప్రవీణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన పారిజాత

**చిట్యాల, విశాలభారతి:** రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు వెలిమినేడు గ్రామంలోని దర్గా వద్ద ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతటి పారిజాత నరసింహ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు బంధు మిత్రులతో కలిసి సంతోషంగా ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు జజరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి,కార్యదర్శి చిరగొని శ్రీశైలం, గోలి గణేష్, కాటం సత్తయ్య,మహమ్మద్ ఖాజాపాషా,గాలిబ్ పాల్గొన్నారు.



# తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే

- **ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వనపర్తి విశాల భారతి :**దేశంలో అక్షర జ్ఞానం అందరికీ అందించాలని ఆకాంక్షించిన తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కొనియాడారు. గురువారం పూలే జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం) లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యురాలైన తన భార్య సావిత్రిబాయ్ కి చదువు చెప్పించి, ఆమెను తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసిన ఘనత జ్యోతిరావు పూలేకు దక్కిందన్నారు. నేటి యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, కౌన్సిలర్లు విభూది నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# విప్లవోద్యమ నేత కామ్రేడ్ పైల వాసుదేవరావు

- **ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య**

**నూతనకల్, విశాలభారతి:** ప్రతిఘటన ఉద్యమ నాయకుడు, శ్రీకాకుళ గిరిజనసాయుధ పోరాట నిప్పు రవ్వ కామ్రేడ్ పైల వాసుదేవరావు 14వ వర్ధంతి స్థానిక నూతనకల్ మండల కేంద్రంలో కామ్రేడ్ గునుగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య* పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ పైలా శ్రీకాకుళ పోరాట నిర్మాతల్లో ఒకరు.1968 నవంబర్ 24న రహస్య జీవితంలోకి వెళ్లి తన తుది శ్వాస విడిచే వరకు 42 సంవత్సరాలు రహస్య జీవితం గడిపిన విప్లవోద్యమ నేత అన్నారు. 1964 లోనే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కాలినడకన గ్రామాలు తిరిగి ప్రజలను సాయుదులుగా తయారు చేసినాడు అని శ్రీకాకుళ పోరాటంలో వందలాది మంది మరణించిన ఏనాడు ఎనక అడుగు వేయని త్యాగధనుడని అన్నారు. ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసమే పరితపించిన కామ్రేడ్ పైల జీవితం విప్లవ పోరాటాలను ఆదర్శమని ఆయన మార్గం దోపిడీ పీడనలేని రాజ్యం కోసం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియుజిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు,గడ్డం శ్రీను, పి వై ఎల్నాయకులు ఉప్పుల మణికుమార్,హమాలీ యూనియన్ నాయకులు సైదులు, శ్రీరాములు, వేణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# శాంతి మానవత్వానికి ప్రతీక రంజాన్

**నకిరేకల్, విశాలభారతి:** శాంతి మానవత్వానికి రంజాన్ పండుగ ప్రత్యేక అని టిడిపి రాష్ట్ర నాయకులు ఎండీ జహంగీర్ అన్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా తన స్వగృహంలో కుటుంబ సభ్యులు మిత్రులతో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి, ఈరోజు పండుగ జరుపుకుంటున్న ముస్లింలందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ కూడా సుఖసంతోషాలతో ఉండాలని అల్లాహ్ ని పార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షాహిద్, ఎండి జాహిద్, ఎండి ఆసిఫ్, శానవాస్, అమానుల్లా, ఇంతియాజుద్దీన్, అజీముద్దీన్ పాల్గొన్నారు



# మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిరావు ఫూలే

**సిరికొండ, విశాల భారతి**

భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న కుల వివక్ష, అంటరానితనం, మహిళలపై సాంఘిక దురాచారాలకు సామాజిక రుగ్మతలకు మూలం అవిద్యయే అని గ్రహించి మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే నమ్మి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, మహిళల విద్యా వ్యాప్తికి అహర్నిశలు శ్రమించిన సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య అన్నారు. సామాజిక విప్లవోద్యమ పితామహుడు, సంఘ సంస్కరణలకు,మహిళల విద్యకి ఆద్యుడు, సత్యశోధక్ సమాజ స్థాపకుడు మహాత్మా జ్యోతిరావు పూలే 197 వ జయంతిని గురువారం సత్యశోధక్ పాఠశాలలో నిర్వహించారు. ముందుగా సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్ నర్సయ్య జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలనలంకరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ....సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు.



# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

- **బిజెపి నాయకులు**

**వనపర్తి విశాల భారతి :** పట్టణంలోని భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈద్గా దగ్గర కు వెళ్ళి ప్రార్థనలు ముగిసిన తరువాత ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా దగ్గర ముస్లిం సోదరులను కలుసుకుని అప్యాయతతో ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పి కరచాలం చేశారు. బిజెపి పార్టీ నాయకులు హిందూ ముస్లింలు భాయి భాయి అంటూ పలుకరించుకుని ఆనందం పంచుకున్నారు. అన్ని సేవలను మించిన మానవ సేవ అత్యునతమైనదని చాటి చెప్పే రంజాన్ పండుగ లౌకికవాదమునకు, మతసమరస్యానికి ప్రతికగా నిలుస్తుందని వివిధ పార్టీ ల నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబిరెడ్డి వెంకటరెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు బచ్చురాం, వనపర్తి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ లు పాల్గొన్నారు.





# వేములవాడ గోశాలకు గడ్డికట్టలు అందజేత

**చిగురుమామిడి, విశాల భారతి:**మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన ఠాగూర్ దిలీప్ సింగ్ రామ దంపతులు,గాగిరెడ్డిపల్లే గ్రామా పరిధిలోని బొల్లోనిపల్లె కు చెందిన గుమ్మడి మధు పటేల్ తన కుమార్తె శ్రేయనివి పటేల్ జన్మదినం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి గోశాలకు గడ్డి కట్టలను చూట్టించి గోశాలకు తీసుకువెళ్లి నిర్వహుకులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఠాగూర్ దిలీప్సింగ్ మాట్లాడుతూ 70గడ్డి కట్టలను, గుమ్మడి మధు పటేల్ 80గడ్డి కట్టలను అందజేసినట్లు చెప్పారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోలతో ఉండాలని, పంటలు బాగ పండి గోడ్డు గొదా నల్లంగా ఉండాలని వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడ్డి కట్టలను గోశాలకు అందజేసిన ఇద్దరిని ఠాగూర్ నరెందర్ సింగ్ తోపాటు గ్రామస్థులు అభినందిస్తూ స్వామి వారి అశీస్సులు వారి కుటుంబాలపై ఎల్లప్పుడు ఉండాలని కోరారు.



# రాజనీతి శాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రధానం

**ధర్పల్లి విశాల భారతి,**ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న రామచందర్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. మెదక్ జిల్లా రాజకీయాలు, రాజకీయ నాయకుల విధానాలు అనే అంశంపై పరిశోధనలు చేసి సిద్ధంగా గ్రంధాన్ని సమర్పించగా బుధవారం హైదరాబాదులో డాక్టర్ పట్టా అందుకున్నట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని బంగారుగడ్డ స్థానిక మసీదులో ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు వందల సంఖ్యలో స్థానిక మసీదు వద్దకు చేసారుకొని అందరూ నమాజ్ చదివి తదనంతరం అలైబాలై చేసుకున్నారు

# దొంగతనం జరిగిన షాపులను పరిశీలించిన చిన్నారెడ్డి



**వనపర్తి విశాల భారతి:**

పెబ్బేరు పట్టణ కేంద్రంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, ఏఐసీసీ కార్యదర్శి జిల్లేల చిన్నారెడ్డి దొంగతనం జరిగిన షాపులను పరిశీలించి, షాపు యజమానులతో మాట్లాడారు. షాపు యజమానులకు భరోసాను కల్పిస్తూ ధైర్యంగా ఉండాలని విలువైన వస్తువులు షాపులో కాకుండా తమ ఇళ్లల్లో భద్రపరుచుకోవాలని సూచించడం జరిగింది. దొంగతనం చేసిన దొంగలను వెంటనే పట్టుకునే విధంగా పోలీసులతో మాట్లాడతానని తెలిపి వెంటనే పోలీస్ స్టేషన్ కి వెళ్లి పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది డైలీ రిజిస్టర్ లను తదితర రికార్డులను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలానికి చెందిన ముదిరాజ్ కుల సంఘ సభ్యులు,బిఆర్ఎస్ నాయకులు.. మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి,సమానత్వ పరిపాలన కాంగ్రెస్ తోనే సాధ్యం అని నమ్మి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,సున్నపు అంజయ్య,రెండ్ల రమేష్,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలల పనులు పూర్తి చేయాలి

- ప్రభుత్వ బడుల బలోపేతానికి అమ్మ ఆదర్శ కమిటీలు
- జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటరావు



**సూర్యాపేట, విశాలభారతి:** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మత్తు పనులను క్షేత్రస్థాయిలో గుర్తించి పనులు మొదలుపెట్టాలని కలెక్టర్ ఎస్. వెంకటరావు ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా గురువారం సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువు వద్ద ఉన్న జెడ్పీ గర్ల్స్ హై స్కూల్ లో జరుగుతున్నా అమ్మ ఆదర్శ పాటశాల పనులను పరిశీలించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసిన స్కూల్ లలో విద్యుత్, తాగునీటి సరఫరా, టాయిలెట్ల మరమ్మత్తు ఇతర చేపట్టాల్సిన పనులను కమిటీ సభ్యులు, స్కూల్ హెచ్ఎం ఇతర అధికారులు కలిసి పరిశీలించాలని సూచించారు. ఆయా పనులను స్కూల్స్ ప్రారంభం అయ్యే లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులపై ప్రతి వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో తాగునీరు, తరగతి గదుల్లో చిన్నచిన్న మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించి పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పని ఎప్పుడు మొదలు పెడతారు ఎప్పటికీ పూర్తి అవుతుందో ఖచ్చితమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మే 31 లోగా మంజూరు అయిన ప్రతి పనిపూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారి ప్రసాద్,ఆదికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ సీతారామచంద్ర స్వామి తలంబ్రాలు

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీ రామనవమి సందర్భంగా పోసి తలంబ్రాల బియ్యంను మహిళ భక్తమండలిచే తలంబ్రాలు తయారు చేసే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున మహిళా భక్తమండలి పాల్గొన్నారు. కార్యక్రమంలో వెన్ రెడ్డి సంధ్య, కామిశెట్టి శైలజ, ఉజ్జిని మంజుల గారు,పోలోజు శ్రీలత, బొబ్బిళ్ళ సంధ్య, ఉప్పల కుసుమ కామి శెట్టి శ్రీదేవి, బొబ్బిల్ల మాధవి, చింతల కరుణ, నాంపల్లి సంగీత, బొబ్బిళ్ల సుజాత, మహిళ భక్తులు పాల్గొన్నారు.



# అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు ఫూలే

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం కిసాన్ నగర్ లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ప్రభుత్వ విప్ అనిల్ ఈరవత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ అనిల్ మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం,మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే అని ప్రసంసించారు. సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన, స్త్రీ, పురుషులకు సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు.



# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు ఫూలే..

**చిగురుమామిడి, విశాల భారతి:** సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసి, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతి రావు పూలే అని ఎంపీపీ కొత్త వినీత, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ లు తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో గురువారం జ్యోతిరావు పూలే 197వ జయంతిని యువ ప్రతిభ యూత్ అధ్యక్షుడు సుధగోని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రచయిత, కవి, మేధావి జ్యోతిరావు పూలే అని అన్నారు. ఉల్లంపల్లి గ్రామంలో జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విగ్రహాలను స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సుధగోని శ్రీనివాస్ గౌడ్ ను అతిథులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి,బంక చందు,దాసరి ప్రవీణ్ కుమార్ నేత, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

**చిట్యాల, విశాలభారతి:** జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను చిట్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ గుడి సెంటర్ లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోకల దేవదాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఆయన అందరికీ ఆదర్శప్రాయం అని, బడుగు బలహీన వర్గాల వారు ఎలా నడుచుకోవాలని దిశ నిర్దేశం చేసిన మహానుభావులు పూలే సమాజంలో కుల, మత లింగ విభేదాలు లేకుండా మనిషిని మనిషి గౌరవించాలంటే విద్య తోనే సాధ్యమవుతుందని తెలిపారని ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బోడ స్వామి, దళిత నాయకులు గాలి లింగయ్య (అడ్వకేట్), పోకల అశోక్, పోకల యేసు రత్నం, బోడ శ్రీను, నూనె శ్రీకాంత్, జంపాల వెంకన్న, జిట్ట మల్లేష్, కుక్కల బిక్షం గంగారం గణేష్, చిత్రగంటి నాగరాజ్, పోకల స్వామి, గాదే ఎల్లేష్, జిట్టా శేఖర్, జిట్ట వెంకన్న, బరాల యాదగిరి, జిట్టా శ్రీకాంత్, బొడ్డు బాబురావు, తదితరులు పాల్గొన్నారు



# త్వరలో మహిళా మోర్చా పూర్తిస్థాయి కమిటీ

- మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా

**వనపర్తి విశాల భారతి:** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ ఆధ్వర్యంలో మహిళా మోర్చా పూర్తిస్థాయి జిల్లా కమిటీ ఎన్నికకు సంబంధించి సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధా మాట్లాడుతూ... రాబోయే వారం రోజుల్లో పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకుని మే 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ గెలుపుకు మహిళా మోర్చా ముందుండి పని చేయాలని పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా ఓట్ల రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీ తొక్కిపెట్టిన చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదంతో చట్టబద్ధత తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసి ప్రధానమంత్రి మోడీ సందేశంతో కూడిన కరపత్రాల పంపిణీ ద్వారా మరొక్కమారు మోడీ ప్రభుత్వం ఏర్పడేలా భారతీయ జనతా పార్టీకి మద్దతుగా నిలిచి కవలం పువ్వు గుర్తుపై ఓటు వేసి నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్ ను అధిక మెజార్టీతో గెలిపించేలా ప్రణాళికలు రూపొందించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్రమ్మ మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ మరియు పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పోచమ్మ తల్లి ఆలయ ఆధునికరణ వేడుకలు..

- ఎంపీపీ కొత్త వినీత రెడ్డి ప్రత్యేక పూజలు
- భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం...

**చిగురుమామిడి, విశాల భారతి:** పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ గ్రామస్తులు గురువారం పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత రెడ్డి భక్తులతో కలిసి పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పోచమ్మ తల్లికి ఓడి బియ్యం,పట్టు వస్త్రాలు,కానుకలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆలయ ఆధునీకరణలో భాగంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయటం సంతోషకరమైన విషయం అన్నారు.గ్రామ దేవత అయిన పోచమ్మ గుడికి మరమ్మతులు చేసి గుడిని మరింత అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

- మానుకోట కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్

**మహబూబాబాద్, విశాలభారతి:** నియోజకవర్గ కేంద్రంలో రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ అనంతరం బలరాం నాయక్, ముఖ్య అనుచరుడు షేక్ రియాజ్ అన్సారీ గారి ఇంట్లో తేనీటి విందుకు హాజరయ్యారు. కేసముద్రం పట్టణ కేంద్రంలో బలరాం నాయక్, వ్యక్తిగత సహాయకుడు షేక్ ముజీబ్ అక్తర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు వారి స్వగృహానికి వెళ్లి తేనీటి విందుకు హాజరై, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట నియోజకవర్గ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.



# మాదిగల మద్దతు మల్లు రవికే

- సతీష్ మాదిగ

**వనపర్తి విశాల భారతి::** భారతీయ జనతా పార్టీ అంటే 400 సీట్లు వస్తే భారత రాజ్యాంగానికి మారుస్తాను అని గొప్పలు చెప్పుకుంటున్న పరిస్థితుల్లో 400 నుండి 4 సీట్లు కూడా రావచ్చని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్ మాదిగ జోష్యం చెప్పారు. మల్లు రవి 1991 నుండి 98 వరకు నాగర్కర్నూల్ పార్లమెంటులో ఎంపీగా పనులు చేసి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని అలాంటి వ్యక్తిని మరో పారి అవకాశం ఇచ్చి నాగర్కర్నూల్ పార్లమెంటు నుండి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత అన్ని సామాజిక వర్గాల నుండి అన్న వర్గాలకు బాధ్యత ఉందని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం వర్గీకరణతో మాదిగలను మభ్యపెడుతున్నదని అందులో మందకృష్ణ మాదిగ మోసపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మందకృష్ణ మాదిగ, నరేంద్ర మోడీ చేస్తున్న మోసాన్ని గ్రహించి మాదిగలకు కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సమన్వయ న్యాయం జరుగుతుందని భావించాలని ఆయన కోరారు. ముఖ్య నాయకులు పాల్గొని మాదిగల మద్దతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని గెలుపు లక్ష్యంగా పనిచేయాలన్నారు.




# అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

**మహబూబాబాద్, విశాలభారతి:** ఎస్పీ సుదీర్ రామనాథ్ కేకన్ ఆదేశానూ సరంగా అడిషనల్ ఎస్పీ సార్ చెన్నయ్య ఆధ్వర్యంలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంబాలపల్లి, మహబూబాబాద్. ఈ షీటీం అవగాహన ప్రోగ్రాంను
ఏ.హెచ్.టి.యు యూనిట్ తో కలిసి సంయుక్తంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో షీ.టీం ఎస్సై సునంద అవగాహన కార్యక్రమంలో షీ.టీం గురించి వివరిస్తూ విద్యార్థులందరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్ గాని వాట్సాప్ కాల్ గాని మాట్లాడవద్దని అపరిచిత వ్యక్తులు కానీ అపరిచిత గ్రూపుల నుండి వచ్చినటువంటి తెలియని లింకులను ప్రెస్ చేయవద్దని వివరిస్తూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు, ఉప్పలయ్య, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, శివరాణి, మల్లారెడ్డి, సతీష్ కుమార్, తిరుపతి, సోమేశ్వర్, వనజ మొదలగు అధ్యాపక సిబ్బంది, షీ.టీం ఏఎస్ఐ ఆనందం పాల్గొన్నారు.



# సామాజిక విప్లవ మూర్తి మహాత్మ జ్యోతిరావు ఫూలే

- బహుజన చైతన్య ప్రవక్త పూలే

**వనపర్తి విశాల భారతి::** కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలోసంఘ సంస్కర్త సామాజిక విప్లవ మూర్తి మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజావాగ్గేయకారడు రాజారామ్ ప్రకాష్ మాట్లాడుతూ.. మన దేశంలోని కుల వ్యవస్థ పై ధ్వజమెత్తి దుమ్ముదులిపేసిన మొదటి ఉద్యమకారుడు జ్యోతిబాపూలే అన్నారు. కులం పేరుతో తరతరాలుగా అణచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించిన మహనీయుడాయని
ఆధునిక భారతదేశంలో సూద్రులు అతి శూద్రులు అభ్యున్నతికి కోసం కృషి చేసిన బహుజన చైతన్య దీపిక మహాత్మ జ్యోతిరావు పూలే ఇచ్చిన మెట్ల కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెకలించి చాలని అందరికీ సమన్యాయం కావాలని అందరికీ సమాన ప్రాతినిధ్యం కావాలని పూలే మహా ఉద్యమాన్ని మొదలు పెట్టిన సామాజిక చైతన్య మూర్తి మహాత్మ జ్యోతిబా పూలే అని అన్నారు. దేశంలో అందరికీ సమానత్వం ఉండాలని స్త్రీ పురుషుల మధ్య వివక్ష ఉండకూడదని సామాజిక తత్వవేత్త పూలే బోధించారు. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ఆశయసాధన కోసం మనమందరం కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరిరాజా చారి,కవి శ్రేష్ఠుడు వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ ,సుధా నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ పగిడ్యాల శ్రీనివాస్ ,రాష్ట్ర దళిత నాయకుడు గండు శివుడు మొదలగు వారు పాల్గొన్నారు .

# ఎల్ ఓసి అందజేత



**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన జనగం సుజాత రెండు కిడ్నీలు చెడిపోయి నిస్సహాయ స్థితిలో ఉండగా బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ని సంప్రదించారు.ఆయన చికిత్స కోసం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్లో చేరవలసిందిగా తెలిపి హాస్పటల్ కు పంపించారు. వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2 లక్షల 50 వేల ఎల్ఓసిని మంజూరు చేయించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సునీల్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు ఫూలే

**సైదాపూర్, విశాల భారతి:** మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద గురువారం మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే 197వ, జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు రేగుల అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. అణగారిన వర్గాలకు అక్షర దీపంగా వెలిగిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో రాయిశెట్టి చంద్రయ్య, వస్తాదుల సదానందం, నెల్లి పోచయ్య, లంకసిరి రాజు, నీర్ల వెంకట్రాజ్యం, బొమ్మగాని రాజు, గోపగాని నవీన్, మొలుగూరి తిరుపతి, నెల్లి రాములు, గాదపాక అశోక్, జక్కోజు బిక్షపతి, గూల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.



## అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఫూలే ఎంతో కృషి చేశారు

■ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.....

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజక వర్గం వేల్పూర్ మండల కేంద్రంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిపిన మహాత్మ జ్యోతీరావ్ ఫులే 197వ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలతో ఘనమైన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు,దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఫులే కృషి చేశారని అన్నారు.

## జ్యోతిరావు పూలే జీవితమే మనకు ఆదర్శం

■ ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకట్రావు



**భద్రాచలం, విశాలభారతి:** స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సామాజిక విప్లవకారులు మహాత్మ జ్యోతిరావు పూలే 197 వ జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా పెరియార్ వహించగా మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య, తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు గురజాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని మాట్లాడుతూ.. సామాజిక విప్లవకారులు మహాత్మ జ్యోతిరావు పూలే అని,బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అని,అంటరానితనాన్ని రూపుమాపడం కోసం కృషి చేసిన సంఘసంస్కర్త అని, మహిళా విద్య అభివృద్ధికి మార్గదర్శి నిత్య స్ఫూర్తి ప్రదాత అని, సామాజిక అసమానతలు తొలగించిన కాంతిరేఖ దీన జనుల జీవితాల్లో వెలుగు రేఖ మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమ నాయకులు డాక్టర్ భాను ప్రసాద్, ఈటె రాజేశ్వరరావు, భీమపాక పెదరాజు, అరికెళ్ల తిరుపతిరావు, జయశంకర్ రావు, చాట్ల రవికుమార్, మామిడి పుల్లారావు, మదర్ తెరిసా ట్రస్ట్ నిర్వాహకులు కొప్పుల మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతికి చిహ్నం రంజాన్

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తుర్కయంజాల్ లో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షల అనంతరం పండగ జరుపుకొన్నారు. అల్లా చల్లని దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని ముస్లిం మత పెద్దలు తెలిపారు.



## ఘనంగా రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మహబూబాబాద్, విశాలభారతి:** తెలంగాణ రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం వేడుకలు సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో సాయంకాలం జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకత్వం. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నల్లపు సుధాకర్ హాజరై రైతుల సమస్యలపై మాట్లాడటం జరిగింది. పాల్గొన్న ఎస్ఎఫ్ఐ. జిల్లా నాయకులు గుగులోతు సూర్య ప్రకాష్,సింహాద్రి. ఎద్దు ఏడ్చిన చోట వ్యవసాయం నిలబడదు రైతు ఏడ్చిన చోట రాజ్యం నిలబడదు సామెతను రాజ్యం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. భవిష్యత్తులో రైతు సంఘం ఉద్యమాలకు ఎస్ఎఫ్ఐ ఎల్లవేళల మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చేపూరీ గణేష్, ఉపేందర్ రెడ్డి, దల్ సింగ్, వీరన్న తదితర రైతుల పాల్గొన్నారు.



## సామాజిక విప్లవకారుడు ఫూలే

■ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

**కురవి, విశాలభారతి:** వివక్షత ,అణిచివేత పై ఆనాటి ప్రజలను చైతన్యం చేసిన విప్లవ వైతాళికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సిపిఐ కొరవి మండల సమితి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించి ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి 18 వ శతాబ్దంలోనే అక్షరంతోనే అణగారిన వర్గాలలో చైతన్యం వస్తుందని అనేక పాఠశాలలను నెలకొల్పిన గొప్ప వైతాళికుడు పూలే అని సత్యశోధక్' అనే సంస్థతో సామాజిక అసమానతలపై అనేక ఉద్యమాలను నడిపిన గొప్ప విప్లవ వైతాళికుడు పూలే అని, వారి ఆలోచన విధానాన్ని, భావజాలాన్ని నేటి తరం ప్రచారం చేసి ఆచరించాలని అప్పుడే అసమానతలు లేని సమాజ స్థాపన జరుగుతుందని అన్నారు.

## లంబాడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా భీమా నాయక్



**మహబూబాబాద్, విశాల భారతి:** లంబాడి హక్కుల పోరాట సంఘం నూతన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిగా గుగులోతు భీమా నాయక్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

బుధవారం హనుమకొండ జిల్లాలోని గిరిజన భవన్ లో జరిగిన రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో 33 జిల్లాల ప్రతినిధులు హాజరవ్వగా ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జిలకర శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. అనంతరం జిలకర శ్రీనివాస్ సంఘం రాష్ట్ర కమిటీని ప్రతిపాదించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన భీమా నాయక్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నిక అవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు. గత 27 సంవత్సరాల నుండి గిరిజనుల సమస్యలపై, రైతుల సమస్యలపై, ప్రజా సమస్యలపై నిరంతరం రాజులేని పోరాటాలు నిర్వహిస్తూ, ఎన్ని ఒడిదుడుకులు ఎదురొచ్చినా, ఎన్ని అడ్డంకులు వచ్చినా, విమర్శలు వచ్చిన అన్నిటిని దాటుకొని తను నమ్ముకున్న సిద్ధాంతమే ఊపిరిగా అంచెలుఅంచెలుగా ఎదిగిన నేత భీమా నాయక్ అన్నారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ లో బాధ్యతలు నిర్వహించి, అనంతరం సిపిఎం పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పనిచేసి, వామపక్ష భావజాలం అలవర్చుకొని రాజకీయాలలో అనేక అవకాశాలు వచ్చిన ఆఫర్ లో వచ్చిన వదులుకొని, ప్రజల సమస్యలు, గిరిజనుల సమస్యలు పోవాలంటే పోరాటాలే ఏజండా అని, నిరంతరం ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యం చేయడమే తన లక్ష్యమని అన్నారు.

భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా సమరసిల పోరాటాలు నిర్వహిస్తానని, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ నిలుస్తామని, లంబాడీల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తానని భీమా నాయక్ తెలిపారు.



## చెరువు లూటీ చేసిన గ్రామస్థులు

**మోతె, విశాల భారతి:** మండల కేంద్రంలో పోలీష్ స్టేషన్ కు ఎదురుగా ఉన్న తుమ్మల చెరువు లో మోతె గ్రామానికి చెందిన మచ్యాకారుల సొసైటీ చాపల చెరువు లో సుమారు గా పది హేను సంవత్సరాల క్రితం ఒక సొసైటీ ఏర్పాటు చేసి స్వంత డబ్బులు మరి కొంత ప్రభుత్వ సహకారంతో గత పది సంవత్సరాలు గా చెరువులో చేపల పెంపకం చేసి ఉపాధి పొందుతున్నారు గత ఏడాది కాలం క్రితం నుంచి సొసైటీ సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు రావడంతో రెండుగా చీలిన సొసైటీ లో నిత్యం ఘర్షణ లు చోటు చేసుకోవడంతో పలు మార్లు సొసైటీ సభ్యులు చర్చలు జరిపిన ప్రయోజనం లేకపోవడంతో చిలికి చిలికి గాలివాన మారిన పరిస్థితులకు అనుగుణగా గతంలో గడిసిన ప్రభుత్వం లో అధికారం అండతో గ్రామ ప్రజలకు చెరువులో చేపలు ఇవ్వడం లో రేటు విషయంలో అనేక సార్లు గ్రామ ప్రజలు ఘర్షణ పడ్డారని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రం లోని రెండు కుంటల లో మచ్యా సొసైటీ సభ్యులు పోసిన చేపలు ఇటీవల సుమారు వారం రోజుల క్రితం నుంచి రాత్రి వేళలో లూటీ చేయడం తో ప్రస్తుతం మండలంలో గ్రామంలో అధికార పార్టీ అండతో మండల కేంద్రం లోని రెండు చేపల కుంటల ను లూటీ చేయడం ఏమిటని పలువురు సొసైటీ సభ్యులు పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసిన ప్పటి కి స్పందించడం లేదని పలువురు చర్చించు కుంటున్నారు సొసైటీ చెరువుల లూటీ చేయడంతో గ్రామంలో రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పరాకాష్ట అని పలువురు విస్తు పోతున్నారు.



## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

**నకిరేకల్, విశాలభారతి:** మహాత్మా జ్యోతిరావ్ గోవింద్ రావ్ పూలే జయంతి సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయం నందు వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక కార్యకర్తగా, సంఘ సంస్కర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేక పోరాటానికి బాటలు వేసిన క్రాంతి కారుడు పూలే అని అన్నారు.వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త జ్యోతి బా పూలే అని కొనియాడారు. దళిత, బహుజన జనోద్ధరణ కోసం జీవితకాలం పూలే చేసిన కృషి భారత సమాజంలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేసిందన్నారు.తన సహచరి సావిత్రి బాయి పూలే కు విద్యాబుద్ధులు నేర్పి దేశంలో ప్రథమ ఉపాధ్యాయురాలిని చేసి స్త్రీ విద్యకు బాటలు వేసిన ఘనత పూలేకు దక్కుతుందన్నారు.పూలే ఆశయ సాధన దిశగా నిరంతరం కృషి చేయాలని పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో నకిరేకల్ మండల పిఏసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## సర్క్యులర్ 1894 ను అమలు చేయాలి

**చిట్యాల, విశాలభారతి:** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సర్కులర్ నెం 1894 ని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు.

గురువారం నాడు చిట్యాల మండలం పేరెపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ 2023 డిసెంబర్ 14న తెలంగాణ గవర్నమెంట్ పంచాయతి రాజ్, రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ వారు జారీ చేసిన సర్కులర్ నెంబర్ 1894 ప్రకారం ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలకు మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తూ 32 జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారని ఒక మనిషికి రోజు రెండు లీటర్ల వాటర్ సప్లై కి రెండున్నర రూపాయలు చొప్పున ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు అమలు చేసే విధంగా ఆదేశాలు జారీ చెప్పినప్పటికీ నేటికీ అమలు కావడం లేదని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 వ తేదీ నుండి దినసరి కూలి 300 రూపాయలు ఇస్తామని ప్రకటించిందని కానీ ఎండలు తీవ్రతరంగా ఉండడం మూలంగా కూలీలకు పనికి తగ్గ వేతనం రావడం లేదని సమ్మర్ అలవెన్స్ 30శాతం అమలు చేయాలని, కొలతలు లేకుండా వేతనం ఇవ్వాలని, పని ప్రదేశాలలో టెంట్లు, మెడికల్ కిట్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కూలీలకు 20 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దినసరి కూలి 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి, మండల కార్యదర్శి మెట్టు పరమేష్, మండల ఉపాధ్యక్షులు అరూరి నరసింహ, నాయకులు అంతటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**బయ్యారం, విశాలభారతి:** మహాత్మ జ్యోతి రావు బాపూలే జయంతి సందర్భంగా ఈ రోజు బయ్యారం మండల కేంద్రంలో టిఎస్ టిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా పూలే దంపతులకు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిఎస్ టి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ రంగన్న, ప్రజాకవి కొమిరె వెంకన్న మాట్లాడుతూ..భారత దేశంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే దంపతులు అహర్నిశలు కృషి చేశారని, కేవలం విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని భావించి ఆనాడు విద్యా వ్యాప్తి కోసం 150 పాఠశాలలు స్థాపించి చదువు నేర్పించడం జరిగిందని మహాత్మ జ్యోతి రావు పూలే శ్రీమతి సావిత్రిబాయి పూలే కు చదువు చెప్పి ఆమె ద్వారా బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు స్థాపించి వారికి చదువు నేర్పి వారి అభివృద్ధికి కృషి చేశారని, మనం సమాజంలో చదువుకుంటున్నామన్న, అభివృద్ధి చెందామన్న, ప్రపంచ జ్ఞానాన్ని తెలుసుకుంటున్నమంటే ఆ మహానుభావుల త్యాగమేనని అలాంటి వారిని స్మరించుకోవడం మన అదృష్టం మరియు మనందరి బాధ్యతని వారన్నారు. కార్యక్రమంలో టిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రూప్లా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి జి మంగీలాల్, జిల్లా కార్యదర్శి జి రామారావు, మండల నాయకులు బి భాస్కర్, బాలాజీ, బి. రవీందర్, చిరంజీవి, శ్రీకాంత్, తుడుం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## కేవీకే ను సందర్శించిన థియో వాన్ డి సాండే

**గరిడేపల్లి, విశాలభారతి:** థియో వాన్ డి సాండే, మాజీ సీనియర్ పాలసీ అడ్వైజర్, డెవలప్మెంట్ కోఆపరేషన్ మంత్రి, నెదర్లాండ్స్ ప్రభుత్వం పర్యటనలో భాగంగా గడ్డిపల్లి కేవీకే ను సందర్శిచారు. నెదర్లాండ్స్ ప్రభుత్వ సహకారంతో ఏబీఎఫ్ అనేక పరిశోధన మరియు విస్తరణ ప్రాజెక్టుల ద్వారా ఎస్ ఏఐఆర్ డి /కేవీకే గడ్డిపల్లికి మద్దతిచ్చింది. మినిస్ట్రీ ఫర్ డెవలప్మెంట్ కోఆపరేషన్లో ఈ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్గా థియో ఏపీ ఎన్ ఎల్ బి పి కి నిధులు సమకూర్చడంలో మరియు పర్యవేక్షించడంలో చాలా కీలక పాత్ర పోషించారు. తన అధ్యయన పర్యటనలో థియో ప్రాజెక్ట్లను అమలు చేయడంలో ఏ పి ఎన్ ఎల్ బి పి తో సహకరించిన కొన్ని ఇన్స్టిట్యూట్లను మళ్లీ సందర్శించడానికి ఆసక్తి చూపారు. తదుపరి కేవీకేలో ఉన్న డేమో యూనిట్లను సందర్శించారు. ఎస్ ఏ ఐ ఆర్ డి/కేవీకే అనేది అనేక ప్రాజెక్ట్లను అమలు చేయడంలో చురుకుగా పాల్గొన్న అటువంటి కేంద్రాలలో ఒకటి కాబట్టి, అతను ఎస్ ఏ ఐ ఆర్ డి /కేవీకే ని మళ్లీ సందర్శించి, కేవీకే లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ ఏ ఐ ఆర్ డి కేవీకే సెక్రటరీ యం స్నేహాలత, ఎస్ఏఐఆర్ డి డైరెక్టర్ ఘంటా అమరేందర్ రెడ్డి, కేవీకే ఇన్చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి నరేష్, కేవీకే శాస్త్రవేత్తలు, ఆఫీసు సిబ్బంది మరియు నెదర్లాండ్ ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందిన రైతులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై పోరాటం చేసే వ్యక్తి జహంగీర్

**నకిరేకల్, విశాలభారతి:** నిజాయితీగా ప్రజా సమస్యల పై పోరాటమే దినచర్యగా కొనసాగుతున్న భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి యం డి జహంగీర్ ను అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించి, గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో గురువారం నాడు జరిగిన సిపిఎం గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేసే జహంగీర్ ను అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు.పార్టీ సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రశ్నిం చే గొంతు గల వామపక్ష, కమ్యూనిస్టు అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించి, ఎర్రజెండా ఘనతను చాటిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. నెల్లికంటీ నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్,మండల పార్టీ కార్యదర్శి అరూరి శ్రీను, మండల నాయకులు కత్తుల లింగస్వామి,యం పి టి సి మెంబర్ దేశబోయిన స్వరూప, గ్రామ శాఖ కార్యదర్శి పంది నరేష్, అరూరి శంభయ్య, మామిడి రాములు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించుకుందాం



**శాలిగౌరారం, విశాలభారతి:** భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపీగా గెలిపించుకుందామని రామగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లోడంగి సైదులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడితూ దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని భువనగిరి గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరవేసి చామల కిరణ్ కుమార్ రెడ్డిని పార్లమెంటుకు పంపించాలని , చేయ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

# మహోనుభావుల స్ఫూర్తిని భావితరాలకు అందించాలి

- మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



**సూర్యాపేట, విశాలభారతి:** సమాజ మార్పు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహోనుభావుల స్ఫూర్తిని బావి తరాలకు అందించాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మట్టిపల్లి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. *ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విద్య యొక్క ప్రాధాన్యతను తెలిపిన మొట్టమొదటి ఉపాధ్యాయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. మన దేశం వెనుకబడెందుకు కారణం దేశంలో 90 శాతం మందికి విద్య లేకపోవడమేనని అందుకే పుట్టిన ప్రతి ఒక్కరికి విద్య అందాలని స్త్రీ పురుషులకు సమానంగా విద్య అందించాలని ఆలోచనతో దేశంలో అట్టడుగు వర్గాలకు విద్యను అందించిన ఘనత జ్యోతిరావు పూలే దే అన్నారు. విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి సమాజానికి నాణ్యమైన విద్యను అందిస్తే అది అద్భుతమైన సమాజంగా అవుతుందని బలంగా నమ్మి నాడు ఎంతో మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాడన్నారు. తన సతీమణి సావిత్రి బాయి పూలేకు చదువు చెప్పి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా చేసిన ఘనత పూలేదే అని కొనియాడారు. పూలే అడుగుజాడల్లో సావిత్రిబాయి సైతం వితంతువులకు వివాహాలు చేయడంతో పాటు వారికి విద్యను అందించడంలో విశేష కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత సత్యనారణ పిల్లె, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తలమల్ల హాసిన్, కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేనారెడ్డి, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, అనపర్తి రాజేష్, కుంభం రాజేందర్, ఆల్ ఇండియా చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరు వెంకన్న గౌడ్, నాయకులు చలమల్ల నరసింహ, కంచుకోముల వెంకట్, భూపతి నారాయణ, గైగుల్ల మహేష్ యాదవ్, ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్

**చిట్యాల, విశాలభారతి:** మతసామరస్యానికి ప్రత్యేక రంజాన్ పండుగని చిట్యాల మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అన్నారు. రంజాన్ వేడుక సందర్భంగా చిట్యాల పట్టణంలోని శివనేని గూడెం రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద మైనార్టీ నాయకులకు మున్సిపాలిటీ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే ఈ రంజాన్ పండుగను ముస్లింలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరి తో ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోనేటి కృష్ణ, బెల్లి సత్తయ్య, రెముడాల లింగస్వామి, నాయకులు జమీరుద్దీన్, ఎస్.కె ఇబ్రహీం, జమాన్ల శ్రీనివాస్ రెడ్డి, గంట్ల శ్రీనివాస్ రెడ్డి, పలువురు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి అభ్యర్ధినే గెలిపించుకుందాం

**చిట్యాల, విశాలభారతి:** మున్సిపాలిటీ 98వ బూత్ లో బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు భువనగిరి పార్లమెంట్ కో ఇన్చార్జ్ మాస శ్రీనివాస్ 98 బూత్ అధ్యక్షులు భానుక ఉదయ్ సేన ఆధ్వర్యంలో లాబాది సంపర్కు అభియాన్ కార్యక్రమంలో భాగంగా మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలని కరోనా సమయంలో వ్యాక్సిన్ పేదలకు ఉచిత బియ్యం ఇంటింటికి మరుగుదొడ్లు ప్రతి ఒక్కరికి ఉచిత బ్యాంకు అకౌంటు, 20 రూపాయలకే ప్రమాద బీమా, 360 రూపాయలకే జీవన బీమా, అటల్ పెన్షన్, కిసాన్ యోజన, ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, పథకాలు లబ్ధిదారులకు వివరిస్తూ మరోసారి కేంద్రంలో నరేంద్ర మోడీ ని భువనగిరి పార్లమెంట్లో బూర నర్సయ్య గౌడ్ ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జయారపు రామకృష్ణ, గురిజ రాజేష్, నాతి మధు, కోర్పోలు శ్రీశైలం పాల్గొన్నారు.



## వాహన తనిఖీలు నిర్వహించిన సీఐ

**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కేంద్రంలోని జనగామ సూర్యాపేట జాతీయ రహదారి పై పోలీస్ స్టేషన్ ఆవరణలో పాలకుర్తి సి ఐ మహేందర్ రెడ్డి సిఆర్ పిఎఫ్ సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ దృష్ట్యా పాలకుర్తి నియోజకవర్గంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు సి ఐ మహేందర్ రెడ్డి తెలిపారు. రూ"50 వేల కన్నా ఎక్కువ నగదు తరలించేవారు కచ్చితంగా రసీదు చూపాలన్నారు. లేకుంటే డబ్బులు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు బంగారం, వెండి, లాంటి వస్తువులు తరలించేటప్పుడు రసీదు తప్పకుండా వెంట తెచ్చుకోవాలని అన్నారు. అదేవిధంగా వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, డ్రైవింగ్ లైసెన్సు, ఆర్ సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్నెస్ అన్ని పత్రాలను వాహనదారులు వెంట ఉంచుకోవాలని, పై వాటిలో ఏ పత్రాలు లేకపోయినా వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని, రోడ్లపై వాహనాలను నిలుపరాదని, సౌండ్ వచ్చే వాహనాలను మరియు అతి వేగంతో వాహనాలను రోడ్లపై నడపరాదని, రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలని, అన్నీ పత్రాలు వాహనంతో వెంట ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ తనిఖీలో ఎస్సై చెన్నకేశవులుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## రైతుల కోసం పోరాటం చేసేది ఏఐకేఎస్ మాత్రమే

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందాల శంకర్ రెడ్డి

**నూతనకల్, విశాలభారతి:** దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసేది ఏఐకెఎస్ మాత్రమేనని తెలంగాణరైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందాల శంకర్ రెడ్డి అన్నారు.

గురువారంవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో అఖిలభారత కిసాన్ సభ (ఏఐకెఎస్ ) దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11 న వలస పాలన కు , భూస్వామ్య పీడనకు, కంపెనీ వ్యవసాయకు వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెల్లుబికిన రైతుల పోరాటం సంఘటితపర్చే క్రమంలో ఉత్తర ప్రదేశ్ లక్నో వేదికగా అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావం జరిగింది అని అన్నారు, సాగు దారులకు భూములు పై హక్కు డిమాండ్ను జాతీయ డిమాండ్ గా మార్చింది అని అన్నారు. ప్రపంచ ఖ్యాతిని పొందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, బెంగాల్ తెబాగ రైతాంగ పోరాటం, కేరళ ఉన్నప్ప వాయిలార్ రైతాంగ పోరాటం, మహారాష్ట్ర వర్లి ఆదివాసీ గిరిజన రైతాంగ పోరాటాల్లో అఖిల భారత కిసాన్ సభ భాగస్వామి అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు గజవెల్లి శ్రీనివాసరెడ్డి, లింగయ్య, బొజ్జ శీను, సామ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అంతటా 24 గంటలు పోలీస్ నిఘా

- ఆకస్మిక రైడ్ లు నిర్వహిస్తున్నాం
- ఇప్పటివరకు మొత్తం 4.55 కోట్ల విలువ సీజ్ చేశాం



**సూర్యాపేట, విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో బాగంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ఠమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాష్ట్ర సరిహద్దు వెంట నిఘా ఉంచామని, సరిహద్దు వెంట, రామాపురం క్రాస్ రోడ్డు వద్ద, మట్టపల్లి బ్రిడ్జ వద్ద, దొండపాడు వద్ద, పులిచింతల ప్రాజెక్ట్ వద్ద, చింత్రియాల వద్ద, బగ్గమాదారం వద్ద అంతరాష్ట్ర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి అక్రమ రవాణా అడ్డుకుంటున్నామని వెల్లడించారు. ఆంధ్రా రాష్ట్ర అధికారులతో సమన్వయంతో పని చేస్తున్నామని, అలాగే అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ లకు అనుబంధంగా అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ లు ఎన్ హెచ్ 65 పై టేకుమట్ల వద్ద, బీమారం వద్ద, పాత తిరుమలగిరి వద్ద, వెలిషాల వద్ద, మామిల్లగుడెం వద్ద, శాంతినగర్ వద్ద చిల్లేపల్లి వద్ద, కుంటపల్లి వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు.



## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతోత్సవం

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతోత్సవాన్ని పురస్కరించుకుని చందానగర్ డివిజన్ పరిధిలోని తపస్వి ఫౌండేషన్ అనాధ శరణాలయంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతి రావ్ పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థిని విద్యార్థులకు ఫ్రూట్స్, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు జ్యోతిరావు గోవిందరావు పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలో 1827 ఏప్రిల్ 11న జన్మించిన ఆయన అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప మహనీయుడు అని అన్నారు. సమాజంలో తరతరాలుగా అణగారిన వర్గాల సర్వతోముఖాభివృద్ధికై 'సత్యశోధక్ సమాజ్' ను ఏర్పాటు చేసి ఈ వర్గాల అభ్యున్నతికోసం కృషి చేసిన గొప్ప మానవతావాదిగా అభి వర్ణించారు. మానవుడు సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే కేవలం విద్య ద్వారానే సాధ్యమని భావించి శూద్రులకు, అతిశూద్రులకు ముఖ్యంగా మహిళల అక్షరాస్యతకై విశేషమైన కృషి చేశారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు విద్య నేర్పించి తదనంతరం ఉపాధ్యాయ శిక్షణనిప్పించి 1848లో మహిళలకు తొలి మహిళా పాఠశాలను ఏర్పాటు చేశారు. అలా సావిత్రిబాయి పూలే మనదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని అయ్యారని గుర్తు చేశారు. అపై దాదాపుగా మరో 52 పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. పూలేకు చిన్న నాటి నుంచి ఛత్రపతి శివాజీ, జార్జ్ వాషింగ్టన్ ల జీవితాలు ప్రభావితం చేశాయని, థామస్ రచించిన మానవహక్కుల పుస్తకం అతని ఆలోచనలను పదునెక్కించాయన్నారు. మహాత్మా పూలే రచయితగా, సంపాదకుడిగా ఈ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, అంటరాని తనానికి వ్యతిరేకంగా చైతన్యం కలిగించారు. అతను బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాడారు. అలాగే వితంతువులయిన మహిళలకు పునర్వివాహాలకై ప్రజలలో చైతన్యం కలిగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు శ్రీమతి చందు శాంతి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, శివరామకృష్ణ, ధర్మ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**పాలకీడు, విశాలభారతి:** మండలం కేంద్రంలోని ఎల్లాపురం గ్రామంలో గల ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ లో పాల్గొని వారికి, మరియు పాలకీడు మండలం ముస్లిం సోదరులకు, మరియు వారి కుటుంబ సభ్యులకు పాలకీడు MPP భూక్యా గోపాల్ నాయక్, మరియు పాలకీడు ZPTC బుజ్జి మోతిలాల్ నాయక్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా రంజాన్ పండుగ గురించి మాట్లాడుతూ ముస్లిం పవిత్ర గ్రంథం ఖురాన్ సంపూర్ణంగా అవతరించిన రంజాన్ మాసం ను ముస్లింలు ఎంతో పవిత్రం గా భావిస్తారు. ఈ పవిత్ర మాసంలో ఉపవాసంలు, దీక్షలు, దానాలు, ధర్మాలు చేపడతారు. నెలవంక తో ప్రారంభమైన రంజాన్ మాసం నెలవంక రాకతో ముగుస్తుంది. 'ఈద్ ఉల్ ఫితర్ ' పండగ తో రంజాన్ పండుగ ముగుస్తుంది. మరి ఇట్టి 40 రోజులు ముస్లిం సోదరులు ఎంతో భక్తితో ఉపవాసాలు చేసి, ప్రార్ధనలు చేస్తారు అని, ఇట్టి పండుగ వాతావరణం లో ఈ సంవత్సరం అంత అల్లా దీవెనలతో రాష్ట్రములో మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలంతా సంతోషంగా ఉండాలి అని ఇరువురు నాయకులు ప్రార్ధనలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాలకీడు SI లక్ష్మి నర్సయ్య, మండల బ్లాక్ ప్రెసిడెంట్ తీగల శేషి రెడ్డి, పాలకీడు గ్రామం యొక్క కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు MD. చాంద్ భాష, MD అజీజ్, SK అజీజ్, SK ఖయ్యూం, MPTC వెంకటయ్య సతీష్, మరియు ముస్లిం పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు.



## మాలసంఘం అధ్యక్షుడిగా చెవుల దశరథ

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మాల సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా చెవుల దశరథ, గౌరవ అధ్యక్షుడిగా ఓనమాల లక్ష్మయ్య ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా ఓనమాల వేణుగోపాల్, కడారి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి తావుల శ్రీనాథ్, కోశాధికారిగా చెవుల నరేందర్, సంయుక్త కార్యదర్శి ఓనమాల చక్రపాణి, చెవుల వంశీ, రావుల యాదయ్య, గౌరవ సలహాదారుడు తావుల జగన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దశరథ మాట్లాడుతూ మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. తమ ఎన్నికకు సహకరించిన కుల బాంధవులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తుర్కయంజాల్ లో మాలల అభివృద్ధికి తమ కమిటీ పనిచేస్తుందని హామీ ఇచ్చారు. మాలాల సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. అలాగే నూతన సభ్యులుగా చెవుల విష్ణు, ఓనమాల బలరాం, చెవుల నవీన్, కడారి కిరణ్, రాంప్రసాద్, వినోద్, సాయికృష్ణ, భాస్కర్, అశోక్, గణేష్, శ్రీకాంత్ ఎన్నిక అయినట్టు వెల్లడించారు.





## చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

- మీకు సేవ చేసే అవకాశం కల్పించండి
- గడ్డం రంజిత్ రెడ్డి

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని శేర్లింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. గురువారం శేరలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హైదర్నగర్ డివిజన్ హెచ్ఎంటి కమ్యూనిటీ హాల్ ఏర్పాటుచేసిన డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన నిదర్శనం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం ఎందుకు సాగుతుందని పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఎల్లప్పుడూ తమ అందుబాటులో ఉంటామని ఆయన అన్నారు. అనంతరం అభ్యర్థి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరని నేపథ్యంలో శేరిలింగంపల్లి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకునే బాధ్యత తనదని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ గా తనను గెలిపిస్తే చేవెళ్ల పార్లమెంట్ అభివృద్ధితో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ జరపెట్టి జైపాల్, మాజీ కార్పొరేటర్లు భాను ప్రసాద్ జానకిరామరాజు శేరిలింగంపల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, నాయకులు రఘునాథ్ యాదవ్, మహిపాల్ యాదవ్, నల్ల సంజీవరెడ్డి, గొట్టుముక్కల వెంకటేశ్వర్ రావ్, సత్యం గౌడ్, కృష్ణ ముదిరాజ్, కావూరి ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, మన్నేపల్లి సాంబశివరావు, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అణగారినవర్గాల ఆశాజ్యోతి పూలే

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని... ఆయన ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్, ప్రముఖ న్యాయవాది కె. అరుణ్ కుమార్ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతిన వేడుకలు నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నాయకులు బి శంకరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కిషన్, అరుణ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి సామాజిక విప్లవ పోరాటాలకు స్ఫూర్తి అని కొనియాడారు. దేశంలో అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని అన్నారు. సత్యశోధన మండలి ఏర్పాటు చేసి సమానత్వం, మహిళా సాధికారత, విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా పూలే కృషి చేశారన్నారు. ముఖ్యంగా చదువుతోనే అందరికీ సమన్యాయం, సమానాభివృద్ధి సాధ్యమని జ్యోతిరావు పూలే నమ్మారని తెలిపారు. సనాతన సాంప్రదాయాలకు, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారుడు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అణగారినవర్గాల అభ్యున్నతి కోసం అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు యం.సత్యనారాయణ, ఐ. భాస్కర్, కె.వెంకట కృష్ణ, ఎన్.యాదగిరి, మాధవ రెడ్డి, పల్లె కృష్ణ, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రంజాన్ వేడుకలు

- శేరిలింగంపల్లి వ్యాప్తంగా ముస్లింల ఈద్ ప్రార్ధనలు
- ఈద్గా వద్ద వేల సంఖ్యలో ముస్లింల ప్రార్ధనలు
- రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి.నియోజకవర్గంలోని అన్ని డివిజన్ పరిధిలో ఈద్‌ఉల్‌ఫితర్‌ను ఉత్సాహంతో వైభవంగా జరుపుకున్నారు.దీంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లవిరిసింది.ముస్లింలు ఈద్గాలు,మసీదుల వద్ద ఈద్ ప్రార్ధనలు నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.శేరిలింగంపల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏండీ అన్వర్ షరీఫ్ ఆధ్వర్యంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి .ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకాపూడి గాంధీ హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మహేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ వచ్చింది కష్టాలు మొదలయ్యాయి

**ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి**

**ఎల్బీనగర్ విశాలభారతి:** బీఆర్ఎస్ పార్టీ ఎంతో బలంగా ఉందని పార్టీ నుంచి ఎవరు బయటకు వెళ్లినా ఎటువంటి నష్టం లేదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం కొత్తపేట రాజధాని గార్డెన్స్ లో జరిగింది. మల్కాజ్ గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో కరెంట్ కష్టాలు, మంచినీటి కష్టాలు మొదలై నివాసాలలో జనరేటర్లు, ఇన్వర్టర్లను రిపేర్ చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. నీటి కోసం ట్యాంకర్ల చుట్టూ బిందెలు పట్టుకుని తిరిగే దుస్థితి దాపురించిందన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ బలమైన శక్తిగా ఉందని పార్టీ మారే వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీని వీడిన వారు మరలా ఈ పార్టీ వైపు చూసే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో పార్టీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి నియోజకవర్గంలో భారీ మెజార్టీని అందించాలని సూచించారు. ఈ సమావేశంలో దయానంద్ గుప్తా, డివిజన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు సాగర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.




హయత్ నగర్ లోని హయత్ బక్షి బేగం మజీద్, పెద్ద మసీద్ లో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ , హయత్నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి .

# పార్టీ మారిన ఎమ్మెల్యేలను వదిలిపెట్టం

- వారి ఇంటి ముందు ధర్నాలు చేస్తాం
- సావు డప్పు కొడతాం
- వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- దానం నాగేందర్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

దానం నాగేందర్ పై పిటిషన్ దాఖలు చేసి నెల రోజులు కావస్తున్నా చర్య తీసుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశామని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సానుకూల తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల ఇండ్ల వద్ద చావు డప్పు కొడతామని హెచ్చరించారు. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 3 నెలల్లో చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆరోపించారు. కడియం, తెల్లం వెంకట్రావుపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు యత్నించామని, స్పీకర్ తమకు సమయం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను రిజిస్టర్ పోస్ట్, ఈమెయిల్ ద్వారా స్పీకర్‌కు పంపినట్లు కేపీ వివేకానంద తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద బీఆర్ఎస్ నేతలు ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలని కేపీ వివేకానంద ప్రశ్నించారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని వ్యవస్థలను తన చేతుల్లో పెట్టుకుని, నియంత్రించాలనే ప్రయత్నం చేస్తున్నారని కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య తెలంగాణ స్థాపిస్తామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామంటూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చారని, కానీ నేడు మాటలకు, చేతలకు సంబంధం లేదని దుయ్యబట్టారు. ప్రస్తుతం పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయతలేదని, ప్రజలలో నమ్మకం పోయిందన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ అంటే కన్‌ఫ్యూజన్, కరప్షన్ పార్టీగా మారిందని వివేకానంద ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కడా స్థిరంగా లేవని ఆయన పేర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్‌ను అపహాస్యం చేస్తూ రాష్ట్ర నాయకత్వం వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. రాహుల్ నీతులు చెబుతుంటే, రేవంత్ గోతులు తవ్వుతున్నారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తమ ఎమ్మెల్యేల మీద నమ్మకం లేక పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

# బీఆర్ఎస్ విజయం ఖాయం

**సన్నాహక సమావేశంలో నేే555తల ధీమా..**

**విశాల భారతి, ఏప్రిల్ కంటోన్మెంట్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికతో పాటు మల్కాజ్ గిరి ఎంపీ ఎన్నికలకు సంబంధించిన సన్నాహక సమావేశం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు ఆఫీసులో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఎన్నికల ఇంఛార్జ్ శ్రీధర్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, పాండు యాదవ్, లోకనాథం, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, సీనియర్ నాయకులు ఆకుల హరి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ టీఎన్ శ్రీనివాస్, పెద్దల నర్సింహ యాదవ్ తో పాటు పలు వార్డుల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, ఉద్యమకారులు, దివంగత ఎమ్మెల్యే సాయన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు. కంటోన్మెంట్ లో గెలుపు ఖాయమని, తేలాల్సింది మెజార్టీయేనని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇంఛార్జ్ శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా సొంత ఇల్లు కూడా లేని సాయన్న కుటుంబాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సాయన్న సేవలను అందరూ ఒక్కసారిగా గుర్తుకు తెచ్చుకోవాలని కోరారు. ఒకే ఏడాదిలో ఎమ్మెల్యేలు సాయన్న, లాస్యనందితను కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత వెంటే ఉన్నారని తేల్చిచెప్పారు. ఇతర పార్టీలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని... ప్రచారంలో ప్రతి ఒక్క ఓటరును కలవాలని సూచించారు.

కంటోన్మెంట్ ఉప ఎన్నికల ప్రస్తావన రాగానే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ప్రసంగిస్తుండగా..జోహార్ సాయన్న, జోహార్ లాస్యనందిత నినాదాలు మిన్నంటాయిమ్ సమావేశంలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రతినబూనారు.ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.






# పూలే స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాదిద్దాం

**సికింద్రాబాద్, విశాలభారతి:** మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతు 150 సంవత్సరాల క్రితమే తను విద్యను నేర్చుకొని, తన భాగస్వామికి విద్యను నేర్పించి సమాజమే తన కుటుంబంగా భావించి బహుజన వర్గాలకు పాఠశాలలను పెట్టించి విద్యను నేర్పించిన గొప్ప యోధుడు మహాత్మ జ్యోతిబా పూలే అని బొల్లెపల్లి స్వామి గౌడ్ అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే జీవితాన్ని పోరాటాన్ని పాఠ్యాంశాలలో చేర్చి, అదేవిధంగా తెలంగాణలో ఉన్న 33 జిల్లాలలో ఏదో ఒక జిల్లాకు మహాత్మ జ్యోతిబా పూలే జిల్లాగా నామకరణం చేయాలని, తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలని బొల్లెపల్లి స్వామి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎంఎస్ఎఫ్ ఓయూ ప్రెసిడెంట్ శ్రీకాంత్, బిఆర్ఎస్ విద్యార్థి నాయకుడు మేడి పవన్,రీసెర్చ్ స్కాలర్స్ పెరుమల్ల ఏడుకొండలు, రంగు సుధాకర్ గౌడ్ ,బద్రి, పుట్ట పవన్, సంతోష్, కిరణ్, గణేష్, జయంత్, మహేష్, రాజశేఖర్, వెంకటేష్, నవీన్,ప్రవీణ్ ,కిషోర్, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.



# అసమానతల పై జ్యోతిరావ్ పూలేది అలుపెరుగని పోరు: బండి రమేష్

**విశాలభారతి,కూకట్ పల్లి:** సమసమాజ స్థాపన కోసం 150 ఏళ్ల క్రితమే పునాది వేసి సంఘసంస్కర్త జ్యోతిరావ్ పూలే అని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ కొనియాడారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. పూలే 197వ జయంతి సందర్భంగా బాలానగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బండి రమేష్ గారు మాట్లాడుతూ దేశంలోనీ నాటి బడుగు బలహీనవర్గాల అణగారిన వర్గాల వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు తన సతీమణితో కలిసి కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. జ్యోతిరావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ సర్కార్ ముందుకు తీసుకెళుతుందని స్పష్టం చేశారు. మూసాపేట మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన జ్యోతిరావు పూలే చిత్రపటానికి కూడా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నియోజకవర్గ అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డిడివిజన్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, మహిళ నాయకురాలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా రంజాన్ వేడుకలు

**- భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు**

**బోడుప్పల్ ,విశాలభారతి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర పరిధిలోని మస్జీద్ఏకతుబ్షాహీ (ఆలంగీర్) నందు పెద్దసంఖ్యలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు మహమ్మద్ షఫీ ఆలం రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.మస్జీద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ తాజుద్దీన్ మాట్లాడుతూ.... పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్థనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు. తెలంగాణ సమాజం "గంగా, జామునా తెహజీబ్" మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవడానికి సహకరించిన మున్సిపల్ అధికారులకు,సిబ్బందికి, పోలీస్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మన సమాజంలో సామరస్యం, కరుణ, స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ సభ్యులు మహబూబ్ అలీ,మొహమ్మద్ ఖాన్, అలీం,ఖాదర్,మీరావలి,అబ్దుల్ హమీద్,అహ్మద్,అక్బర్, షఫీ, అబ్బాస్, మిస్కిన్ వలి, ఇస్మాయిల్, మోయిన్, తదితరులు పాల్గొన్నారు



# రంజాన్ వేడుకల్లో నివేధిత సాయన్న

**శాంతి సమాధానం సమాజహితం..**

**కంటోన్మెంట్, విశాలభారతి:** శాంతి సమాధానం తోనే సమాజం ముందుకు సాగుతుందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజికవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నివేధిత సాయన్న స్పష్టం చేశారు. రంజాన్ పర్వదినోత్సవం సందర్భందా నియోజికవర్గంలో పలు ప్రాంతాల్లో నిర్వహించి వేడుకల్లో పాల్దొని ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. సుమారు 40 రోజుల పాటు కఠిన ఉపవాసం పూర్తి చేసి అల్లా కృపకు పాత్రులయ్యాని వివరించారు .కంటోన్మెంట్ అన్నానగర్ లోని ఈద్గా వద్ద ముసల్మాన్ లను మర్యాధపూర్వకంగా కలిశారు. మల్కాజిరిగి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తో కలిసి రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. బాలంరాయి, కార్ఖానా, రసూల్‌పురలో ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరు సుఖ సంతోషాలతో ఉండాలని నివేదిత ఆకాంక్షించారు.



# మహాత్మా జ్యోతిబాయి ఫూలే నేటికీ స్ఫూర్తిదాయకం

**మధుయాస్కి గౌడ్**

**ఎల్బీనగర్, విశాలభారతి:** సామాజిక దార్శనికుడిగా, సంఘ సంస్కర్తగా, వర్ణవివక్షతపై పోరాడిన క్రాంతికారుడు పూలే అని అన్నారు. ఆయన ఆశయాల సాధన, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పరిపాలన కొనసాగిందన్నారు. పూలే 198వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్లోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మధుయాస్కి గౌడ్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పూలే, బాబు జగ్జీవన్‌రాం కలలుగన్న పాలనను తాము నిజం చేస్థామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సామాజిక సమానత్వ దిశగా కృషి చేస్థామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి , టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి , కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి , టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కోకన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి , బద్దుల వెంకటేష్ యాదవ్ ,డివిజన్ల అధ్యక్షులు మకుటం సదాశివుడు, బుడ్డ సత్యనారాయణ, లింగాల కిషోర్ గౌడ్, కుట్ల నర్సింహా యాదవ్, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, మంజులా రెడ్డి, వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్లు ఈశ్వరమ్మ యాదవ్, మల్లారపు శాలిని, జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల నిర్వాహకులు శనిగరపు స్వామి, మెడిగ శ్రీధర్, వెంకటేష్ గౌడ్, స్వర్ణ మాధవి, రమేష్ నాయక్, రాజేశ్వరి, అనసూయ, దేవి రెడ్డి శ్వేత, గాంధీ నాయక్, కోటగిరి శ్రీనివాస్, పల్లె నర్సింహారెడ్డి, చెరుకు చిరంజీవి గౌడ్, రవీందర్, భవాని, వసంత, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లతో ఎవరిని కొట్టాలి

- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలనా?
- ప్రోత్సహించిన రేవంత్ రెడ్డి నా?
- రేవంత్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు
- అనర్హతా పిటిషన్లు దాఖలు చేసేందుకు, సభాపతి అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదు
- కాంగ్రెస్ అంటే కన్‌ఫ్యూజన్, కరప్షన్
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 3 నెలల్లో చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కడియం, తెల్లం వెంకట్రావుపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు యత్నించామని, స్పీకర్ తమకు సమయం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను రిజిస్టర్ పోస్ట్, ఈమెయిల్ ద్వారా స్పీకర్‌కు పంపినట్లు కేపీ వివేకానంద తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద బీఆర్ఎస్ నేతలు ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు.



పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని గతంలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారని, ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలని కేపీ వివేకానంద ప్రశ్నించారు. పార్టీ మారిన శాసనభ్యులపై అనర్హత వేటు వేసే వరకు అన్ని రకాలుగా పోరాడతామని. మూడు చోట్లా ఉపఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. అనర్హతా పిటిషన్లు దాఖలు చేసేందుకు, సభాపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని వ్యవస్థలను తన చేతుల్లో పెట్టుకుని, నియంత్రించాలనే ప్రయత్నం చేస్తున్నారని కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య తెలంగాణ స్థాపిస్తామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామంటూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చారని, కానీ నేడు మాటలకు, చేతలకు సంబంధం లేదని దుయ్యబట్టారు. ప్రస్తుతం పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయతలేదని, ప్రజలలో నమ్మకం పోయిందన్నారు.

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com
08
శుక్రవారం,
12.04.2023
హైదరాబాద్
vishalabharathi Telugu Daily



# దేవర నార్త్ ఇండియన్ రైట్స్ సొంతం చేసుకున్న కరణ్‌జోహార్ 'ధర్మ ప్రొడక్షన్స్'

మాన్ ఆఫ్ మాసెస్ నటిస్తున్న భారీ బడ్జెట్ సినిమా దేవర. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రపంచస్థాయిలో బజ్ క్రియేట్ చేస్తున్న సినిమా ఇది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కీ రోల్ చేస్తున్నారు. రెండు పార్టులుగా తెరకెక్కుతోంది దేవర. ఫస్ట్ పార్టు షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళంలో చిత్రాన్ని అత్యంత భారీగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాకు ఇప్పుడు బాలీవుడ్ నుంచి అద్భుతమైన సపోర్ట్ లభించింది. బాలీవుడ్ మేజర్ ప్లేయర్స్ ఈ చిత్రంతో చేతులు కలుపుతున్నారు. ధర్మ ప్రొడక్షన్స్, ఏఏ ఫిల్స్ కలిసి ఈ సినిమాను ఉత్తరాదిన డిస్ట్రిబ్యూట్ చేయనున్నారు. దేవర నార్త్ థియేట్రికల్ రైట్స్ ని కరణ్ జోహార్, అనిల్ తండానీ సొంతం చేసుకున్నారు. అత్యంత భారీ మొత్తం చెల్లించి ఈ మాగ్నమ్ ఆపస్‌ని దక్కించుకున్నారు వారిద్దరూ. ఎన్టీఆర్, కొరటాల శివతో కరణ్ జోహార్, అనిల్ తండానీ, అపూర్వ మెహతా ఉన్న పిక్‌ని షేర్ చేసుకున్నారు. ఎన్టీఆర్‌కి ఉత్తరాదిన ఉన్న స్టార్‌డమ్‌కి, కరణ్ జోహార్, అనిల్ తండానీ పేర్లు యాడ్ కావడంతో వేరే లెవల్ బజ్ క్రియేటైంది. ఉత్తరాది మార్కెట్ నుంచి అనూహ్యమైన కలెక్షన్లు గ్యారంటీ అనే మాట  గట్టిగా వినిపిస్తోంది. ఇండియన్ సినిమాలో మైల్‌స్టోన్ మార్క్ దేవర క్రియేట్ చేస్తుందనే నమ్మకం మరోసారి కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన దేవర గ్లింప్స్ సోషల్ మీడియాలో సరికొత్త రికార్డులను క్రియేట్ చేసింది. ఎన్టీఆర్ రోల్ మీద భీభత్సమైన ఇంట్రస్ట్  క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో ఆయనతో పాటు ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరేన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# #Gopichand32 టైటిల్ విశ్వం

మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఈద్ సందర్భంగా ఫస్ట్ స్ట్రైక్ వీడియోను విడుదల చేయడం ద్వారా మాస్ ఫీస్ట్ ని అందించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై టిజి విశ్వ ప్రసాద్, చిత్రాలయం స్టూడియోస్ పై వేణు దోనేపూడి నిర్మిస్తున్న హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ #గోపీచంద్32కి 'విశ్వం' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. వధూవరులు పెళ్లి మండపంలోకి రావడం, సంగీత విద్వాంసుల బృందం వివిధ వాయిద్యాలను వాయిస్తూ, పూజారి మంత్రాలు పఠించడం , రుచికరమైన ఆహారాన్ని సిద్ధం చేస్తున్న చెఫ్‌లు.. ఇలా వివాహ వేడుకలతో ఫస్ట్ స్ట్రైక్ వీడియో ప్రారంభమవుతుంది. గోపీచంద్ పెద్ద గిటార్ కేస్‌ని భుజంపై వేసుకుని పెళ్లి వేదిక వైపు నడుస్తూ ఎంట్రీ ఇచ్చారు. అది గిటార్ కాదు, మెషిన్ గన్. ఆశ్చర్యకరంగా, అతను వధూవరులను, వివాహానికి వచ్చిన అతిథులందరినీ కాల్చడం ప్రారంభిస్తారు. చివరగా, అతను అక్కడ ఫుడ్ ని ఆస్వాదిస్తూ, "దానే దానే పే లిఖా, ఖానే వాలే కా నామ్... ఇస్పే లిఖా మేరే నామ్..' అని చెప్పడం చాలా పవర్ ఫుల్ గా వుంది. లైట్ గడ్డంతో, డార్క్ కళ్లద్దాలు పెట్టుకుని స్టైలిష్‌గా కనిపించిన గోపీచంద్‌ని నెగెటివ్ షేడ్‌లో చూడటం నిజంగా సర్ప్రైజింగ్ గా ఉంది. అతను డైలాగ్ పలికిన విధానం క్యారెక్టర్ గ్రే షేడ్ ని సూచిస్తుంది. శ్రీను వైట్ల  ఫస్ట్ స్ట్రైక్ ని మాస్ ఫీస్ట్ గా చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఇది చాలా స్టైలిష్‌గా, ప్రామెసింగ్ గా కనిపిస్తుంది.  గోపీచంద్‌ని ఒక విభిన్నమైన పాత్రలో చూపించారు. కేవీ గుహన్ నైపుణ్యం ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. చైతన్ భరద్వాజ్  స్కోర్ సినిమా సాంకేతికంగా ఎంత రిచ్ గా ఉందో తెలియజేస్తుంది. అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్ కన్నుల విందును అందిస్తుంది. మొత్తంమీద, ఫస్ట్ స్ట్రైక్ మాస్ ఫీస్ట్ ని అందించింది.




# పీవీఆర్ మల్టిప్లెక్స్ తీరుపై మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఆగ్రహం

మలయాళంలో ఘన విజయాన్ని సాధిం రికార్డు స్థాయిలో వసూళ్లు కొల్లగొట్టిన మంజుమల్ బాయ్స్ ... తెలుగులోనూ అదే స్థాయిలో ప్రేక్షకుల నుంచి ఆదరణ పొందుతోంది. తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన అన్ని కేంద్రాల్లోనూ మంచి వసూళ్లు  సాధిస్తోంది. ఈ క్రమంలో అనూహ్యంగా పీవీఆర్ మల్టిప్లెక్స్ మంజుమల్ బాయ్స్ తెలుగు వర్షన్ ప్రదర్శనలను ఆపేసింది. మలయాళ నిర్మాతతో ఉన్న వివాదం కారణంగానే ఆ చిత్ర ప్రదర్శనలను ఆపేసినట్లు పీవీఆర్ వెల్లడించింది. పీవీఆర్ మల్టిప్లెక్స్ తీరుపై మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మలయాళ నిర్మాతతో వివాదం ఉంటే తెలుగు వర్షన్ ను ఎలా ఆపేస్తారని ప్రశ్నించారు. మంచి వసూళ్లు సాధిస్తున్న క్రమంలో అర్థాంతరంగా ఆపేయడం అన్యాయమన్న శశిధర్ రెడ్డి... ప్రదర్శనలు ఆపడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. పీవీఆర్ మల్టిప్లెక్స్ వ్యవహారశైలిని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పీవీఆర్ మల్టిప్లెక్స్ తీరుపై ఈ రోజు సాయంత్రం అత్యవసర సమావేశం కానుంది.

# సైలెంట్‌గానే బ్లాస్ట్ చేసేలా ఉంది

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ సమంత గత ఏడాది ఖుషి మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ మూవీ మొదట్లో మంచి టాక్ అందుకున్నప్పటికి ఆ తరువాత బాక్సాఫీస్ వద్ద అనుకున్నంత స్థాయిలో క్లిక్ కాలేదు. ఇక సమంత అంతకుముందు యశోదా అనే ఫీమేల్ సెంట్రిక్ కథతో మెప్పించింది. అయితే ఆ సమయానికి ఆమె మాయోసైటిస్ బారిన పడి ట్రీట్మెంట్ తీసుకుంటుంది. గత కొంత కాలం నుంచి సమంత మానసిక, శారీరక సమస్యలతో సతమతం అవుతోంది.   దీంతో కొంతకాలం సినిమాలకి విరామం ఇచ్చి శారీరకంగా, మానసిక రికవరీ అయ్యే ప్రయత్నం చేసింది. మరల పూర్తి ఫిట్ నెస్ తో సినిమాలకి రెడీ అనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సమంత ది ఫ్యామిలీ మెన్ 2 సిరీస్ దర్శకులతో చేసిన సిటాడెల్ ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ రిలీజ్ కి సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ పూర్తిగా యాక్టింగ్ పైనే సమంత కెరియర్ పైన ఫోకస్ చేసిందని తెలుస్తోంది. అందులో భాగంగా ఆమె చాలా ప్రాజెక్ట్స్   కోసం చర్చలు జరుపుతోందంట. అందులో అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ చేయబోయే పాన్ ఇండియా ప్రాజెక్ట్ కూడా ఉందని సమాచారం. ఈ సినిమాలో సమంత హీరోయిన్ గా మేగ్జిమమ్ కన్ఫర్మ్ అయిపోవచ్చనే మాట వినిపిస్తోంది. ఇక రాబోయే ప్రాజెక్టుల గురించి పెద్దగా హడావుడి చేయకుండానే అమ్మడు నెక్స్ట అప్డేట్స్ తో సోషల్ మీడియాను బ్లాస్ట్ చేసే అవకాశం కనిపిస్తోంది. అలాగే హెచ్ వినోత్ దర్శకత్వంలో ఇళయదళపతి విజయ్ కెరియర్ లో చేయబోయే ఆఖరి సినిమా కోసం కూడా సమంతని హీరోయిన్ గా తీసుకోవాలని అనుకుంటున్నారంట. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్  కాబట్టి సమంతకి కూడా ప్లస్ అవుతాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. అందుకే వీటిని ఒకే చేసే పనిలో సామ్ ఉందంట.



# 'బాక్' నుంచి రాశి ఖన్నా, వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్స్





అత్యంత విజయవంతమైన హార్రర్ కామెడీ సిరీస్ 'అరణ్మనై' దాని నాల్గవ వెర్షన్ మరింత బిగ్గర్ గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. సుందర్ సి దర్శకత్వం వహించడంతో పాటు కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి తెలుగు టైటిల్ 'బాక్'.  తమన్నా భాటియా, రాశి ఖన్నా ప్రధాన పాత్రలు పోషించగా, వెన్నెల కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్,  కోవై సరళ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ నిన్న ఫస్ట్ లుక్ పోస్టర్ల ద్వారా సుందర్ సి, తమన్నా భాటియా పాత్రలను పరిచయం చేశారు. ఈరోజు రాశీఖన్నా, వెన్నెల కిషోర్‌ల ఫస్‌ట్‌లుక్ పోస్టర్‌లను విడుదల చేశారు. రెండు పోస్టర్లలో హాంటెడ్ హౌస్ నేపథ్యంలో భయానకంగా వుంది. రాశి ఖన్నా టెర్రిఫైడ్ గా కనిపించగా, వెన్నెల కిషోర్ కూడా టెన్షన్ పడతూ కనిపించారు.




# తనికెళ్ల భరణి నిర్ణయం..

## త్వరలో సందేశాత్మక చిత్రం!

టాలీవుడ్ లో రూపుదిద్దుకున్న సందేశాత్మక చిత్రం 'నిర్ణయం' త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీనియర్ నటులు తనికెళ్ల భరణి, 'బాహుబలి' హరిశ్చంద్ర రాయల, రఘునాథ రెడ్డి, జనార్ధన్ రావు (జెన్నీ) కీలక పాత్రల్లో నటించారు. జెన్నీ మరియు పీవీ కృష్ణ ప్రసాద్ కలిసి డైరెక్ట్ చేశారు. సంజయ్ కుమార్, అంజలి హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. యూత్ ఫుల్ కంటెంట్ తో పాటు.. యువతకు, తల్లిదండ్రులకు సందేశాన్నిచ్చే చిత్రమిది. తాజాగా ఫిల్మ్ ఛాంబర్ లోని థియేటర్ లో ప్రివ్యూను కూడా పూర్తి చేసుకుంది. పలువురు సినీ ప్రముఖులు విచ్చేసి సినిమా యూనిట్ ను అభినందించారు. ఇక ఇదే టైటిల్ 'నిర్ణయం'తో గతంలో అక్కినేని నాగార్జున యాక్షన్ ఫిల్మ్ వచ్చింది. మరీ ఇప్పుడు అదే టైటిల్ తో వస్తున్న ఈ లేటెస్ట్ ఫిల్మ్ ఎలా అలరిస్తుందో చూడాలి. సుద్దాల అశోక్ తేజ, కుల శేఖర్ పాటలకు చక్కటి సాహిత్యం అందించారు. టీ సురేంద్ర రెడ్డి డీవోపీగా, శర్వాని శివకుమార్ ఎడిటర్ గా వర్క్ చేశారు. కృష్ణ సాయి సంగీతం అందించారు. అనంత్, విశ్వమోన్ ముఖ్య పాత్రలు పోషించారు. త్వరలోనే యూనిట్ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయనుంది.



# జనతాబార్ థియేట్రికల్ ట్రైలర్

ప్రముఖ కథానాయిక రాయ్ లక్ష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు చిత్రం జనతాబార్. రోచిశ్రీ మూవీస్ పతాకపంపై అశ్వథ్ నారాయణ సమర్పణలో రమణ  మొగిలి స్వీయదర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు శక్తికపూర్ ఇంపార్టెంట్ పాత్రను పోషిస్తున్నాడు. ఇటీవల ఈ చిత్రం ట్రైయిలర్ హీరో శ్రీకాంత్ విడుదల చేశాడు.  అన్ని పనులను పూర్తి చేసుకున్న ఈ చిత్రం మేలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ కుస్తీ పోటీల నేపథ్యంలో నడిచే కథ ఇది. నేటి సమాజంలో స్త్రీ ప్రాధాన్యతను చాటి చెప్పే చిత్రమిది. నాలుగు పాటలు, ఫైట్‌స్‌లతో కొనసాగే రెగ్యులర్ చిత్రం కాదు. కమర్షియాల్ అంశాలు వుంటూనే సమాజానికి చక్కని సందేశాన్ని మేళవించి రూపొందించిన చిత్రమిది అన్నారు. కథానాయిక లక్ష్మీరాయ్ మాట్లాడుతూ తెలుగులో మంచి చిత్రం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో రమణ మొగిలి చెప్పిన ఈ కథ నన్ను ఎంతో ఆలోచింపజేసింది. ఒకవేళ ఈ చిత్రం చేయకపోతే నా కెరీర్‌లో ఓ మంచి చిత్రాన్ని కోల్పోయేదాన్ని. నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ఈ సినిమా ఎంతో ఉపయోగపడింది. ఈ చిత్రంలో నా పాత్ర బార్‌గర్ల్‌గా  ప్రారంభమై సమాజంలో మహిళలు గొప్పగా చెప్పుకునే స్థాయికి ఎలా ఎదిగింది అనేది ఎంతో ఆసక్తికరంగా వుంటుంది అన్నారు. యానిమల్ తరువాత  ఈచిత్రంలో మళ్లీ ఓ మంచి పాత్రను చేశాననిన, ఈ సినిమాలో తన  పాత్ర  నలుగురు చెప్పుకునేంత గొప్పగా వుంటుందని  శక్తికపూర్  తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.